www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 28-3-2025 | పేజీలు: 6 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 356

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం,తిథి: చతుర్దశి రా.7:56 తదుపరి అమావాస్య, నక్షత్రం: పూర్వాభాద్ర రా.10:09 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: తె. ఉ. 7:45, అమృతఘడియలు: మ.2:57-4:23, దుర్ముహూర్తం: ఉ.8:41-9:30, మ.12:44-1:33, రాహుకాలం: ఉ. 10:30-12:00, సూర్యోదయం: 6:16, సూర్యాస్తమయం: 6:24 | తాడేపల్లిగూడెం సిటీ

Tadepalligudem | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar |Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

Cheil-25291/25

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శుక్రవారం | 28-3-2025
Tadepalligudem | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
తాడేపల్లిగూడెం సిటీ

మొగల్తూరుకు ఏం కావాలి?

- గ్రామ సమగ్రాభివృద్ధికి డీసీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ.. సమస్యల పరిష్కారం దృష్టి
- పేషీ నుంచి నేడు ప్రత్యేక అధికారుల రాక.. ఉదయం 10 గంటలకు గ్రామసభ



■ లోపలి పేజీలో..



సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు వద్ద మండుటెండలో మెట్లు ఎక్కుతూ పనుల పరిశీలన

"పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడానికి ఓ వైపు కేంద్రం సహకారం అందిస్తోంది. మరోవైపు ఎలాంటి ఆటంకం లేకుండా అన్నింటినీ అధిగమించి పూర్తి చేయాలని రాష్ట్రం భావిస్తోంది. ఇలాంటి తరుణంలో పనుల విషయంలో జాప్యం చేసే కాంట్రాక్టు ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెడతాం.

పుష్కరాలు వస్తున్నాయి. వాటికంటే ముందుగానే డ్యాం నిర్మాణం పూర్తి కావాలి. అనుకున్నది అనుకున్నట్టు జరిగేలా త్వరత్వరగా ముందుకు సాగాలి. ప్రత్యేకించి బట్రస్ డ్యాం నిర్మాణాన్ని రెండు నెలల్లో పూర్తి చేయాలి.

గత ప్రభుత్వం హయాంలో ఆర్‌అండ్‌ఆర్ కార్యక్రమాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కాలనీల నిర్మాణం ముందుకు సాగకపోవడం దారుణం. మా ప్రభుత్వం ఇప్పుడు కాలనీల నిర్మాణం పూర్తి చేయడానికి దీనికి అదనపు నిధులు కేటాయిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లోను వచ్చే ఏడాదాంతానికి పరిహారం చెల్లించిన తరువాతే ప్రాజెక్టు నుంచి నీళ్లు ఇస్తాం."

\- సీఎం చంద్రబాబు



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రులు నాదెండ్ల, నిమ్మల, ఎమ్మెల్యేలు రోషన్‌కుమార్, పితాని, జ్యోతుల, బాలరాజు, కామినేని తదితరులు

పరిహారంపై ఫోకస్

నిర్వాసితులకు నిలువెత్తు ధైర్యం ఇచ్చిన సీఎం చంద్రబాబు

- వచ్చే ఏడాదాంతానికి పూర్తి పరిహారం
- ఎవరూ అధైర్యపడరాదంటూ భరోసా
- ప్రాజెక్టు నిర్మాణం పూర్తికి దిశా నిర్దేశం
- కాంట్రాక్టు ఏజన్సీల ముందు నిర్దేశిత లక్ష్యాలు
- నిర్లక్ష్యం చేస్తే బ్లాక్ లిస్టులో పెడతామని వార్నింగ్
- పోలవరం పరిసరాల్లో పర్యాటకం అభివృద్ధి
- నాలుగు గంటలకు పైగా పోలవరంలో పర్యటన

పూర్తి పరిహారం కోసం చాన్నాళ్ల నుంచి ఎదురుచూస్తున్న పోలవరం నిర్వాసిత కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం తీపి కబురు చెప్పారు. 2026 సంవత్సరాంతానికి పూర్తి పరిహారాన్ని ఇస్తామని ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలనకు వచ్చిన ఆయన నిర్వాసితులతో భేటీ అయ్యారు. ప్రాజెక్టు పనులు జరిగే ప్రాంతానికి వెళ్లి పురోగతిని పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు ఏజన్సీలను ఆదేశించారు.



నిర్వాసితులతో సీఎం చంద్రబాబు

(ఏలూరు/పోలవరం-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు, పరిహారం చెల్లింపు వంటి విషయాలపై ముఖ్యమంత్రి ఈసారి స్పష్టత ఇచ్చారు. సాధ్యమైనంత మేర వచ్చే ఏడాది జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు నుంచే గ్రావిటీ ద్వారా కుడి, ఎడమ కాలువల కనెక్టివిటీల ద్వారా నీరు అందించే ప్రయత్నం చేస్తామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. ప్రత్యేకించి పోలవరం ప్రాజెక్టు పరిధిలో గ్యాప్-1, గ్యాప్-2, ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులన్నింటికీ తేదీలు ఖరారు చేసి ఆ మేరకు పనులు పూర్తయ్యేలా లక్ష్యాలు నిర్దేశించారు. అదే విషయాన్ని కాంట్రాక్టు ఏజెన్సీలకు, ఇంజనీర్ల ముందు ఉంచి జాప్యం జరిగితే మాత్రం సహించేది లేదని సున్నిత హెచ్చరికలు జారీచేశారు. ఈ మధ్య కాలంలో ముఖ్యమంత్రి కాంట్రాక్టు ఏజెన్సీలకు ఈ విధమైన హెచ్చరికలు జారీ చేయడం దాదాపు ఇదే ప్రథమం. పోలవరం ప్రాంతంలో జరుగుతున్న పనులన్నింటినీ ఆయన పదేపదే అడిగి తెలుసుకుంటూనే ఎక్కడెక్కడ ఏప పని ఎంత వ్యవధిలో జరగాలో కూడా నేరుగా దిశ, నిర్దేశం చేశారు. ప్రాజెక్టు నిర్మాణ పనులను ఓ వైపు శరవేగంగా కొనసాగించాలని నిర్దేశించుకుని మరోవైపు పోలవరం ప్రాజెక్టు పరిసరాలను పర్యాటకంగా తీర్చిదిద్దే విషయంలోను అధికారులతో చర్చించారు. పోలవరం ప్రాజెక్టుకు సమీపాన ఉన్న ఐలాండ్‌లో హోటల్ నిర్మాణం జరగాలని, పర్యాటక ప్రాంతంగా ఈ ప్రాంతం రూపుదిద్దుకునేలా చూడాలని సీఎం అన్నారు. పర్యాటకులను ఆకర్షించేలా ఐకాన్ బ్రిడ్జి నిర్మాణం విషయంలోను తగినంత పురోగతి కనబడాలని సూచించారు. పోలవరం నుంచి ధవళేశ్వరం వరకు అఖండ గోదావరి వెంబడి టూరిజం అభివృద్ధి చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు.

పరిహారానికి ప్రాధాన్యత

ప్రతిసారి ముఖ్యమంత్రులు పోలవరం పర్యటనకు వచ్చినప్పుడల్లా నిర్వాసిత కుటుంబాలు తమకు రావాల్సిన పరిహారం విషయంలో న్యాయం చేయాల్సిందిగా పదే పదే ప్రాధేయపడేవారు. కాని సీఎం చంద్రబాబు నిర్వాసిత కుటుంబాలపై ఈసారి ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. వారికి చెల్లించాల్సిన పరిహారం విషయంలో, భవిష్యత్తులో వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులు శ్రద్ధ పెట్టాల్సిందిగా ఆదేశించారు. ఇప్పటికే పునరావాస కాలనీలు పూర్తయిన చోట్ల సౌకర్యాలను పరిశీలించాలని, మిగిలిన కాలనీలను త్వరత్వరగా నిర్మించాలని ఆదేశించారు. ఇప్పటికే రూ.889 కోట్లు నిర్వాసిత కుటుంబాలకు పరిహారంగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వారిలో నైతిక ధైర్యం నూరిపోసేలా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు, పరిహారం విషయంలోను ఒక స్పష్టత ఇచ్చారు. దీంతో నిర్వాసిత కుటుంబాల్లో ఒకింత సంతోషం వెల్లువిరుస్తోంది. ఎక్కడైనా లోటుపాట్లు జరిగితే మాత్రం సహించేదిలేదని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

పోలవరం జిల్లా ప్రస్తావన

గతంలో పోలవరం కేంద్రంగా ఏజెన్సీ జిల్లాను ఏర్పాటు చేసే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా 'పోలవరం ఏజెన్సీ ఏరియాను ప్రత్యేక జిల్లాగా చేయాలనే అంశంపై కసరత్తు చేస్తాం. ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ పూర్తయ్యి నిర్వాసితులు కాలనీలకు చేరువైతేనే గాని ఒక స్పష్టత రాదు. ఆ తరువాతే జిల్లాపై ఒక అవగాహన వస్తుంది' అని చెప్పారు. మీడియా కార్డులు రంగు మార్చే విషయంలోను, ఇంటి స్థలాలు ఇచ్చే విషయంలోను ఇప్పటికే పరిశీలిస్తున్నట్టు చెప్పారు.


పోలవరంలో సీఎం పర్యటన

- పోలవరం ప్రాజెక్టు స్థలికి సీఎం ఆలస్యంగా మధ్యాహ్నం 12 గంటలకు చేరుకున్నారు. హెలీకాప్టర్‌లో ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకుని, ఏరియల్ సర్వే చేశారు. ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించారు.
- 12.16 గంటలకు హెలీప్యాడ్ ప్రాంతానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రికి ఇంతకు ముందు పుష్పగుచ్ఛాలు, శాలువాలు, పూలదండలు సమర్పించేవారు. ఈ సారి దీనికి భిన్నంగా నేతలు, కార్యకర్తలు, అధికారులు ఆయనకు గులాబీ పూలను చేతికందించి స్వాగతం పలికారు. కొందరు ఎర్ర గులాబీలు ఇవ్వగా మరికొందరు పసుపు రంగు గులాబీలు ఇచ్చారు.
- ఇటీవల వైసీపీ నుంచి జనసేనలో చేరిన ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సీఎంకు పాదాభివందనం చేశారు.
- సీఎంకు రాష్ట్ర భారీ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, కామినేని శ్రీనివాస్, జ్యోతుల నెహ్రూ, పితాని సత్యనారాయణ, సొంగా రోషన్, ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ మంత్రి పీతల సుజాత, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, డీఐజీ అశోక్‌కుమార్, ప్రాజక్టు సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, సీఈ నరసింహమూర్తి, ఎస్ఈ సూర్యరామచంద్రరావు, జేసీ ధాత్రిరెడ్డి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ స్వాగతం పలికారు.



సీఎంకు పనుల పురోగతిని వివరిస్తున్న మంత్రి నిమ్మల

- 12.20 గంటలకు సీఎం హిల్ వ్యూ ప్రాంతం నుంచి ప్రాజెక్టు స్పిల్‌వే, స్పిల్ ఛానల్ ప్రాంతాలను పరిశీలించారు. ప్రాజెక్టు సలహాదారు పనులను తెలిపారు.
- ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిర్వాసితులతో సమావేశం.
- ఎగువ కాఫర్ డ్యాం, పనుల ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలన
- గ్యాప్ 1, గ్యాప్ 2 ప్రాంతాలలో పనుల పురోగతిపై ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలన
- 2.30 గంటలకు ప్రాజెక్టు కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష.
- 3.30 గంటలకు మీడియా సమావేశం నిర్వహించారు.
- 4.45 గంటలకు సీఎం హెలీకాప్టర్‌లో తాడేపల్లి పయనం.



పవర్ ప్లాంట్ పనుల పరిశీలన



డ్రెడ్జింగ్ పనుల వద్ద



ఫొటో ఎగ్జిబిషన్



ప్రాజెక్టు పనుల మధ్య కాన్వాయ్



కలెక్టర్ వెట్రిసెల్వితో



యంత్రాల పనితీరును పరిశీలిస్తూ

'పది' సోషల్ స్టడీస్ పరీక్షపై డీఈవో వివరణ

ఏలూరు అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పండుగ తేదీపై స్పష్టతలేని నేపథ్యంలో పదోతరగతి సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహణపై డీఈవో వెంకటలక్ష్మమ్మ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రంజాన్ పండుగ సెలవును ఈనెల 31గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తే సోషల్ స్టడీస్ పరీక్షను ఏప్రిల్ 1న నిర్వహిస్తామని, ఒక వేళ రంజాన్ సెలవును ఏప్రిల్ 1గా నిర్ణయిస్తే పరీక్షను ఈ నెల 31వ తేదీనే నిర్వహిస్తామని వివరించారు. ఈ విషయాన్ని జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లో చదివి, పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్న బాలబాలికలందరికీ తెలపాలని ఆదేశించారు.

'టెన్త్' మూల్యాంకనమూ ఓ పరీక్షే!

- విధుల మినహాయింపునకు టీచర్ల దొడ్డిదారి ప్రయత్నాలు

■ లోపలి పేజీలో..

ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 41.0
కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25 (శుక్ర) | సహారి : 4.40 (శని)

అంతా ప్రశాంతం

జిల్లాలో 10 పంచాయతీల్లో ఉప సర్పంచ్‌ల ఎన్నికలు

ఏలూరుసిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పది పంచాయతీల్లో ఉపసర్పంచ్ పదవులకు గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలోని ముదినేపల్లి మండలంలోని ప్రొద్దువాక, చింతలపూడి మండలంలోని రేచర్ల, మండవల్లి మండలంలోని ముదుతాళ్ళపాడు, లోకమూడి, పెదవేగి మండలంలోని రామసింగవరం, కొండలరావుపాలెం, దెందులూరు మండలంలోని దెందులూరు, నిడమర్రు మండలంలోని ఎనికేపల్లి, కలిదిండి మండలంలోని భాస్కరరావుపేట, కొయ్యలగూడెం మండలంలోని అచ్యుతాపురం పంచాయతీల్లో ఉపసర్పంచ్‌లకు ఎన్నికలు పూర్తయ్యాయి. ప్రొద్దువాక పంచాయతీ ఉపసర్పంచ్‌గా డి.వీరాంజనేయులు, కొండలరావుపాలెం- కెదివ్య, రామసింగవరం- బి.రమేష్, ముదుతాళ్ళపాడు- వి.జీవమ్మ, లోకమూడి- వి.నిర్మల, ఎనికేపల్లి-ఎస్.లక్ష్మి, దెందులూరు- బి.అప్పారావు, భాస్కరరావుపేట-ఎస్ఎం కుమారి, రేచర్ల- జీవీ ముత్యాలరావు, అచ్యుతాపురం- ఎం.ధనలక్ష్మి ఎన్నికయ్యారు. జిల్లాలో ఉప సర్పంచ్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనురాధ తెలిపారు.



సభ్యులు హాజరు కాకపోవడంతో ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరం

ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఉప ఎన్నికలు నేటికి వాయిదా

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు ఎంపీపీ పదవులకు, మూడు వైఎస్ ఎంపీపీ పదవులకు గురువారం ఉప ఎన్నికలు జరగాల్సి ఉండగా సభ్యులు కోరం లేక ఈనెల 28వ తేదీకి వాయిదా పడ్డాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అత్తిలి, యలమంచిలి మండలాల్లో ఎంపిపి పదవులకు, ఏలూరు జిల్లాలోని ఏలూరు, కైకలూరు ,అత్తిలి మండలాల్లో వైస్ ఎంపిపి పదవులకు ఉప ఎన్నికలు గురువారం నిర్వహించాల్సి ఉంది. అయితే సభ్యుల కోరం లేకపోవడంతో ఆ ఉప ఎన్నికలు వాయిదా పడ్డాయని సంబంధిత అధికారులు తెలిపారు.

ఆర్‌అండ్‌బీ ఎస్ఈగా భరతరత్నం

ఏలూరు,మార్చి 27(ఆంధ్రజ్యోతి) : జిల్లా రోడ్లు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) ఎస్ఈగా పి.భరతరత్నం నియమితులయ్యారు. ఈయన ఆర్‌అండ్‌బీ నుంచి ఏపీ మారిటైమ్ బోర్డు ఇన్‌చార్జి ఎస్ఈగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై రానున్నారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేసిన జాన్‌మోషే ఈ నెలలోనే ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్‌గా బదిలీపై వెళ్లడంతో, విజయవాడ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈగా ఉన్న బీఈ భాస్కరావును పూర్తి అదనపు బాధ్యతలతో ఇక్కడ నియమించారు. దీంతో కొత్త ఎస్ఈ త్వరలోనే బాధ్యతలను స్వీకరించనున్నారు.

వేల్పుచర్ల పంచాయతీలో నిధులు గోల్‌మాల్?

స్థానికుల ఫిర్యాదుపై నూజివీడు డీఎల్‌పీవో విచారణ

ముసునూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పుచర్ల పంచాయతీలో లక్షలాది రూపాయలు స్వాహా చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని కోరుతూ పరిమి అశోక్ కుమార్‌తోపాటు మరికొంత మంది స్థానికులు రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథికి, ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో సైతం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు దారులు గురువారం మాట్లాడుతూ 2019 నుంచి నేటి వరకు సుమారు రూ.50 లక్షలు పైగా సర్పంచ్, కార్యదర్శులు సంయుక్తంగా స్వాహా చేశారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మూడున్నరేళ్ల కార్యదర్శిగా ఉన్న జంగం యోహాను డిప్యుటేషన్‌పై బదిలీ అయ్యారు. తర్వాత ఆరు నెలలు కార్యదర్శిగా ఉన్న ఆరేపల్లి వెంకటేశ్వరరావుకు యోహాను చార్జి అప్పగించలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యదర్శిగా బదిలీపై వచ్చిన సీహెచ్.శ్రీనివాసచౌదరికి పది నెలలు గడుస్తున్న నేటికీ పంచాయతీ రికార్డులు అప్పగించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ విధంగా రికార్డులను బయట పెట్టకుండా సర్పంచ్, కార్యదర్శులు పనులు చేయకుండానే లక్షల్లో బిల్లులు మార్చుకుని నిధులను స్వాహా చేశారని వారు ఆరోపించారు. మంచినీరు కుళాయిలు, ఇంటి పన్నులను వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేయకుండా సుమారు రూ.6లక్షలు మింగేశారని ఆరోపించారు. ఈ పంచాయతీలో నిధుల స్వాహాపై సమగ్ర విచారణ చేసి, నిధులను రికవరీ చేయాలని వారు కోరారు. దీనిపై నూజివీడు డీఎల్‌పీవో సుందరి మాట్లాడుతూ వేల్పుచర్ల పంచాయతీ నిధులపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని, సమగ్ర విచారణ చేసి, నివేదికను జిల్లా పంచాయతీ రాజ్ అధికారికి అందజేయనున్నట్టు ఆమె చెప్పారు.



వేల్పుచర్ల గ్రామ సచివాలయ భవనం

మేం కోతకు వచ్చాం..!



కోతకు వచ్చామని చెపుతూ పచ్చని చేలు పసిడి రంగు పులుముకున్నాయి.. దాళ్వా చేలు పలు ప్రాంతాల్లో కోత దశకు వచ్చాయి.. కైకరం వద్ద వరిచేలు ఇలా మెరిసిపోతున్నాయి..

ఫొటోలు -భీమవరం

సీతారాముల కల్యాణానికి రండి..

ఆచంట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మన ఇళ్లల్లో పెళ్లిళ్లకు, ఇతర శుభకార్యాల సమయంలో బంధువులను శుభలేఖలతో ఆహ్వానించడం సంప్రదాయం.ఏప్రిల్ 6న జరిగే సీతారాముల కల్యాణానికి ఆలయాల్లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తుంటారు.ఆచంట మండలం కరుగోరుమిల్లి శివారు ముత్యాలవారిపాలెంలో శ్రీరామ రాయల యూత్ శుభలేఖలను ముద్రించి ఆహ్వానం పంపిస్తున్నారు. ముత్యాలవారిపాలెంలో భద్రాచలం అంటూ పెళ్లి కుమార్తె సీతాదేవి, పెళ్లికుమారుడు శ్రీరామ చంద్రమూర్తితో జరిగే వివాహానికి రావాలంటూ ఆహ్వానం పంపడంపై అంతా చర్చించుకుంటున్నారు.





ఎర్రకాలువ వరద పోటుతో గట్లు తెంచుకుంటూ వరిచేలోకి నీరు (ఫైల్ ఫొటో)

పంట నష్ట పరిహారం అందేనా ?

ఎర్ర కాలువ వరద ముంపు బాధితుల ఎదురుచూపు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గతేడాది జూలై నెలలో ప్రకృతి వైపరీత్యానికి పంట నష్టపోయిన రైతులకు నేటికీ పరిహారం అందక సాయం కోసం ఎదురు చూస్తున్నారు. వారికంటే వెనక పంట నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించడంతో జూలై నెలలో పంటనష్టం బారిన పడిన రైతుల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలో ఆ సమయంలో పంటనష్టపోయిన వారికి జిల్లాలో రూ.9 కోట్ల పరిహారం అందించాలని వ్యవసాయాధికారులు నివేదిక అందించినా నేటికీ ఆ సొమ్ములు రాకపోవడంతో ఆ పరిహారం కోసం రైతులు ఎదురు చూపులు తప్పడం లేదు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఈ పరిహారం అంశాన్ని సభ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ దఫా వచ్చే పరిహారంలో ప్రభుత్వం తమకు పంటనష్టం అందిస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.

తాడేపల్లిగూడెం మండలానికే రూ.6 కోట్లు

గతేడాది జూలైలో ప్రకృతి వైపరీత్యానికి జిల్లాలో 9 కోట్ల రూపాయల పరిహారం అందించాల్సి ఉండగా వాటిలో ఒక్క తాడేపల్లిగూడెం మండలంలోని ఎర్రకాలువ పరివాహక ప్రాంత రైతులకే రూ.6 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. మొత్తం జిల్లాలో సుమారు 2,200 మంది రైతులకు పరిహారం అందాల్సి ఉండగా తాడేపల్లిగూడెం మండలంలోని మాధవరం, జగన్నాధపురం, మారంపల్లి, అప్పారావుపేట, నందమూరు తదితర గ్రామాల రైతులకు ఈ పరిహారం అందించాల్సి ఉంది.

తీవ్రంగా నష్టపోయాం



ఎర్రకాలువ వరదలకు మా ప్రాంతం అంతా పంట తీవ్రంగా నష్టపోయాం. మాకు ప్రత్యే కంగా ఎనిమిదిన్నర ఎకరాలకు పరిహారం అందాల్సి ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి పరిహారం అందించాలని కలెక్టర్, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకు వెళ్లాం.

- ముళ్లపూడి రామకృష్ణ, జగన్నాథపురం

పరిహారం అదించి ఆదుకోవాలి



మా ప్రాంతంలో పంట నష్టం జూలైలో సంభవించింది. ఆగస్టులో పంటనష్టపోయిన వారికి పరిహారం అందించారు. మా ప్రాంత రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి.

- పరిమి వీరభద్రరావు,సొసైటీ మాజీ అధ్యక్షుడు, నవాబుపాలెం

మొగల్తూరుకు ఏం కావాలి ?

గ్రామ అభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవ

అమ్మ పుట్టిన ఊరిపై దృష్టి

అభినందిస్తున్న గ్రామస్థులు

మొగల్తూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు నుంచి ఎందరో ప్రముఖులు వివిధ రంగాలలో స్థిర పడి గ్రామానికి గుర్తింపు తీసుకువస్తే వారందరికీ భిన్నంగా మొగల్తూరు మూలాలు గల కుటుంబ సభ్యుడిగా ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ ఆయన తల్లి అంజనాదేవి సొంతూరు మొగల్తూరు, ఆయన తండ్రి కొణిదల వెంకట్రావు సొంతూరు పెనుగొండలను అభివృద్ధి చేయాలని తలచారు. ఇందులో భాగంగా సుమారు రెండు మాసాల క్రితం మొగల్తూరు పాతకాలువ సెంటర్‌లో ఒకప్పటి వారి సొంత ఇంటి వద్ద రచ్చబండ కార్యక్రమాన్ని జిల్లా డ్వామా, ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ఆయన ఆధీనంలో గల శాఖలకు సంబంధించిన సమస్యలను గుర్తించి నివేదిక రప్పించుకున్నారు. ఈనెల 28 శుక్రవారం మరోసారి మొగల్తూరులో గ్రామసభను నిర్వహించి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ఆయన పేషీ నుంచి ఒక కమిషనర్ స్థాయి అధికారిని మరో నలు గురు ఉన్నతాధికారులను పంపుతున్నారు.

గుర్తించిన కీలక సమస్యలు

పవన్ ఆదేశాలతో వచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ ప్రతినిధులు ప్రణాళిక సిద్ధం చేశారు.

కోనాయికోడు ప్రక్షాళన

మొగల్తూరు పంచాయతీ పరిధిలో గ్రామంలోని మురుగునీరు, చేలల్లోని ముంపునీరు లాగే కోనాయి కోడు డ్రెయిన్ ఆక్రమణలకు గురై పూడుకుపోయి చిన్న పంటబోదెలా మారింది. వర్షం కురిస్తే మొగల్తూరులోని చాలా వార్డులు, నివాస ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. గ్రామంలోనే 3.6 కిలో మీటర్ల పొడవు గల కోనాయికోడు డ్రెయిన్ ఎఫ్ఎంబిలో ఉన్న వెడల్పుతో గట్టుపై ఉన్న ఆక్రమణలు తొలగించి ప్రక్షాళన చేయడంతో పాటు డ్రెయిన్‌కు ఇరు పక్కలా కాంక్రీట్ వాల్స్ నిర్మించి పంచాయతీ పరిధిలో సుమారు 20 కిలోమీటర్ల డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలి.

డంపింగ్ యార్డ్

సుమారు 26 వేల మంది జనాభా, 18 వార్డులు గల మొగల్తూరు పంచాయతీ నరసాపురం నియోజకవర్గంలోనే అతిపెద్ద పంచాయతీ. నిత్యం సేకరించే చెత్తా చెదారాలు డంప్ చేసేం దుకు అనువైన స్థలం లేకపోవడం రహదారులు, ఆక్వా చెరువుల వెంబడి నిత్యం గ్రామంలో సేకరించిన చెత్తను డంప్ చేస్తున్నారు.

ప్రధాన రహదారిని కుదించారు

మొగల్తూరు పాతకాలువ సెంటర్ నుంచి లాకు వరకూ గల ఆర్అండ్‌బీ రహదారిని జాతీయ రహదారుల శాఖ తీసుకుంది. ఈ క్రమంలో మొగల్తూరు పంచాయతీ పరిధిలో 216 జాతీయ రహదారి నిర్మాణం మొగల్తూరు అవుట్ కట్స్ నుంచి నిర్మించారు. పాతకాలువ నుంచి లాకు వద్ద వరకూ గతంలో 21 అడుగులు ఉన్న ప్రధాన రహదారిని 12 అడుగులు చేశారు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆక్రమణలు తొలగించి వెడల్పు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అధ్వానంగా ప్రధాన పంట కాలువ

మొగల్తూరు పంచాయతీ డెల్టా తీరంలో ఉండటంతో మంచినీటికి శివారున, మురుగు నీటికి ముందు వరుసలో ఉంది. నిడదవోలు నుంచి వచ్చే ప్రధాన కాలువ మొగల్తూరు వరకూ ప్రవహించి మొగల్తూరు లాకు వద్ద ఉప్పుటేరులో కలుస్తోంది. ప్రధాన కాలువకు శివారు ప్రాంతం కావడంతో కాలువ ఎగువ ప్రాంతం నుంచి వచ్చే గుర్రపుడెక్క, నాచు, జంతు, మానవ మృత కళేబరాలు ఇక్కడ నిల్వ ఉండి కాలువ కలుషితమవుతోంది. మొగల్తూరు ప్రధాన కాలువను ప్రక్షాళన చేసి ఎగువ ప్రాంతంలో గల అక్రమ మరుగుదొడ్ల కనెక్షన్లు తొలగించి శివారుకు సమగ్ర సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

గ్రంథాలయం అభివృద్ధి చేయాలి

మొగల్తూరులో మెగాస్టార్ చిరంజీవి అభిమానుల సహకారంతో నిర్మించిన శాఖా గ్రంథాలయాన్ని డిజిటల్ గ్రంథాలయంగా అభివృద్ధి చేసి యువత ఉపాధికి స్కిల్ డెవలెప్‌మెంట్ సెంటర్‌ను గ్రంథాలయంలో ఏర్పాటు చేయాలని నిరుద్యోగ యువత కోరుతోంది. పెన్మత్స రంగరాజా జడ్పీ పాఠశాల ఆవరణలో అభిమానులు నిర్మించిన చిరంజీవి కళావేదికను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మొగల్తూరు-మోడి మధ్య వారధి

మొగల్తూరు మండలంలోని పేరుపాలెం, కేపీపాలెం, మోడి గ్రామాల ప్రజలు ప్రతీ అవసరానికి మొగల్తూరు రావల్సిందే. అయితే వీరికి అనువైన రహదారి మార్గం లేదు. మొగల్తూరు-మోడి పంచాయతీ మధ్య ధర్బరేవు డ్రెయిన్‌పై వంతెన నిర్మిస్తే తీరం వెంబడి గ్రామాల ప్రజలు నిత్యం మొగల్తూరు వచ్చేందుకు, మొగల్తూరు అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.10 కోట్లు పంచాయతీ రాజ్ ప్రాజెక్టు నుంచి నిధులు మంజూరు అయ్యాయి.

ధర్బరేవు డ్రెయిన్

మొగల్తూరు-రామన్నపాలెం గ్రామాల పరిధిలోని దర్బరేవు డ్రెయిన్ పూడుకుపోవడం, సముద్ర ఆటుపోటులకు మొగల్తూరు, రామన్నపాలెం ఆయకట్టు భూములు ముంపునకు గురవుతున్నాయి. దీంతో ఇరు గ్రామాల రైతులు పొలాలు ఉన్న సాగు చేయని పరిస్థితి నెలకొంది. ఈడ్రెయిన్ ప్రక్షాళన చేయడం, కొత్తకాయలతిప్ప వద్ద డ్రెయిన్‌పై రెగ్యులేటర్ నిర్మించి ముంపు నివారణ లేకుండా చేయాలని కోరుతున్నారు.

ఈ ప్రధాన సమస్యలతో పాటు మొగల్తూరుకు అనుసంధానంగా ఉన్న మొగల్తూరు-శేరేపాలెం, మొగల్తూరు -వెంప రహదారిని పునర్నిర్మిం చడంతో పాటు, గ్రామంలో విద్య, వైద్య సదు పాయాలు మెరుగుపర్చాలని, మొగల్తూరు మామిడి, ఆక్వా, వరి రైతులకు ఉపయోగపడే విధంగా గోడౌన్‌లు నిర్మించాలని, తదితర మరో 10 సమస్యలపై పంచాయతీ నుంచి వినతులు రూపొందించినట్టు మొగల్తూరు సర్పంచ్ పడవల మేరీ సత్య నారాయణ, ఉప సర్పంచ్ బోణం నర్సింహరావు, పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడుల సూచనలను పాటిస్తూ ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు.



నేడు గ్రామంలో పవన్ పేషీ అధికారుల సమావేశం

మొగల్తూరు గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ప్రతిపాదనలు స్వీకరించేందుకు శుక్రవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేషీ నుంచి అధికారులు మొగల్తూరు వస్తున్నట్టు ఎంపీడీవో త్రిశూల పాణి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక వెంకటేశ్వరా కల్యాణ మండపంలో నిర్వహించే గ్రామ సభ ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుం దన్నారు. కమిషనర్ స్థాయి అధికారితో పాటు మరో నలగురు ఉన్నతాధికారులు, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొంటారని మొగల్తూరు పంచాయతీ పరిధిలో గల గ్రామస్థులు హాజరై సమస్యలు విన్నవించవచ్చని ఎంపీడీవో తెలిపారు.



చెరువులు, రహదారుల వెంబడి చెత్త



మొగల్తూరు మెయిన్ ప్రధాన కాలువ పరిస్థితి



ప్రధాన సమస్యగా ఉన్న కోనాయికోడు డ్రెయిన్

బడుల్లో వాటర్ బెల్ మోగింది

నిడమర్రు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండ వేడిమి రోజురోజుకు ఉధృతమవు తోంది. వేడిగాలులు పెరిగిపోవడంతో చెమట రూపంలో శరీరంలో నీటినిల్వలు తగ్గిపోతాయి. దీనివల్ల వడదెబ్బ తినే అవకాశం ఉంది. డీహైడ్రేషన్ వల్ల కాళ్లు తిమ్మిర్లు ఎక్కడం, కళ్లు ఎరుపెక్కడం, తల తిరగడంతో పాటు జ్వరం లక్షణాలు కనిపిస్తాయి. పాఠశాల విద్యార్థులకు డీహైడ్రేషన్ పరిస్థితుల తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాఠశాల సమయంలో మంచి నీరు తాగడం అలవాటు చేయడం కోసం వాటర్ బెల్ మోగిస్తోంది.

విధి..విధానాలు ఇవీ

విద్యార్థుల్లో డీహైడ్రేషన్, ఉష్ణ సంబంధ రుగ్మతలను నివారించడానికి వేసవి కార్యాచరణ ప్రణాళిక 2025లో భాగంగా వాటర్ బెల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సిబ్బంది క్రమం తప్పకుండా మంచినీటిని తీసుకోవడమే లక్ష్యంగా ఈ వాటర్ బెల్ అమలు చేస్తున్నారు. ఒక ప్రత్యేకమైన బెల్ సౌండ్ ద్వారా విద్యార్థులు నీరు తాగేందుకు అవకాశం ఇవ్వాలి. ఉదయం 10 గంటల నుంచి 12 గంగల వరకు గంటకోసారి బెల్ మోగించాలి. తరగతి గదిలోకి వాటర్ బాటిల్స్ తెచ్చుకొవడానికి అనుమతించాలి.తాగు నీటి వనరులు, సరఫరా ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులే చూసుకోవాలి. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా మోడల్ హైడ్రేషన్ కార్యక్రమంలో పాల్గొని వారిని ప్రోత్సహించాలి.



పాఠశాలలో నీరు తాగుతున్న విద్యార్థులు

- **తప్పనిసరిగా అమలు చేయాలి**



జిల్లాలో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలో వాటర్ బెల్ కార్యక్రమం తప్పనిసరిగా అమలు చేయాలి. పాఠశాల పని దినాలలో ప్రతి రోజు ఉదయం 10, 11, 12 గంటల సమయంలో వాటర్ బెల్ మోగించి పరి శుభ్రమైన, స్వచ్ఛమైన నీరు తాగేలా ప్రోత్స హించాలి. స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి.

- వెంకట లక్ష్మమ్మ, డీఈవో, ఏలూరు



పంచాయతీల్లో సంపద సృష్టిపై దృష్టి

తెరుచుకుంటున్న చెత్త సంపద తయారీ కేంద్రాలు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మూత

పునరుద్ధరణకు చర్యలు

ఏలూరుసిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్వర్ణభారత్,స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహి స్తోంది. పంచాయతీ స్థాయిలో చెత్త సేకరణకు ప్రాధాన్యం ఇచ్చి చెత్తకుప్పలు లేని గ్రామాలుగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం పనిచేస్తోంది. ప్రతి ఇంటింటా చెత్త సేకరణ చేయాలని , సేకరించిన చెత్తను సాలిడ్ వెల్త్ ప్రొసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ) లకు తర లించాలని నిర్ణయించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్‌డబ్ల్యూఎం షెడ్లు ఏర్పాటు చేసి చెత్తనుంచి సంపద సృష్టించాలని నిర్ణయించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి తద్వారా చెత్త సంపద తయారీ కేంద్రాలలో వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి విక్రయించి తద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలని నిర్ణయించారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధనకు గ్రామాల్లో వారంలో మూడు రోజుల పాటు ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నారు.

ఏలూరు జిల్లాలో పనిచేస్తున్నవి 333..

ఏలూరు జిల్లాలో 547 గ్రామ పంచాయతీ లుండగా ఇందులో 545 గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో ప్రస్తుతం 333 కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తుండగా 11 చోట్ల షెడ్లు ఉన్నా మరమ్మతులు చేయాల్సి ఉంది. 12 చోట్ల అసలు షెడ్లు ఏర్పాటు చేయలేదు. మిగిలిన 289 చోట్ల ఈ కేంద్రాలను పునరుద్ధరించటానికి చర్యలు చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వం వీటిని నిర్లక్ష్యం చేయడంతో అవి దాదాపు చాలా ప్రాంతాల్లో మూత బడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే సంపద కేంద్రాలను పునరుద్ధరించి వాటి ద్వారా చెత్తనుంచి సంపద సృష్టించాలని నిర్ణయించారు.

ప్రస్తుతం 333 చోట్ల పూర్తిస్థాయిలో చెత్తనుంచి సంపద తయారీలో భాగంగా వర్మీకంపోస్టు ఎరువును తయారు చేస్తుండగా మిగిలిన 289 కేంద్రాలలో తాత్కాలికంగా చెత్తను సేకరించి మాగబెడుతున్నారు. చెత్త సేకరణలో భాగంగా తడిచెత్త, పొడి చెత్తను వేరుచేసి ఈ కేంద్రాలలో వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించటం జరుగుతోంది. జిల్లా పంచాయతీ అధికారి అనూరాధ ఎప్పటికప్పుడు గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. డివిజన్ స్థాయిలో డీఎల్ పీవో మండల స్థాయిలో ఈవోపీఆర్‌డీలు చెత్త సేకరణ విషయంపై గ్రామ పంచాయతీ అధికా రులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు.

- **ఏప్రిల్ నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో నిర్వహణ**



జిల్లాలో చెత్త సేకరణ ఒక ఉద్యమంలా కొనసాగుతోంది. మూతబడిన కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన తెరుస్తున్నాం. గ్రామా లను చెత్త కుప్పలు లేని గ్రామాలుగా తీర్చి దిద్దుతున్నాం. జిల్లాలో ఇప్పటికే 333 సంపద తయారీ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో చెత్త నుంచి సంపద తయారవుతోంది. మిగిలిన చోట్ల కూడా చెత్త నుంచి తయారు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఏప్రిల్ నెలాఖరు నాటికి అన్ని పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా కార్యాచరణ రూపొందించాం.గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడే కాగా, ప్రతి గురువారం చెత్త నుంచి తయారు చేసిన వర్మీ కంపోస్టు ఎరువును విక్రయిస్తున్నారు.

- కొడాలి అనూరాధ , జిల్లా పంచాయతీ అధికారి , ఏలూరు జిల్లా



చక్రస్నానం నిర్వహిస్తున్న పండితులు

చెన్నకేశవునికి చక్రస్నానం

ఏలూరురూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల దత్తత క్షేత్రమైన ఏలూరు శనివారపు పేట చెన్నకేశవస్వామి ఆలయంలో భూదేవి, శ్రీదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం నిత్యహోమం, బలిహరణ, పంచామృత స్నపనం, తదుపరి చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. ద్వారకాతిరుమల దేవస్థానం వేద పండితులు ఆధ్వర్యంలో చక్రస్నానం నిర్వహించారు. ఆలయ అర్చకులు హయగ్రీవాచార్యులు పర్యవేక్షించారు.

శివునికి రుద్రాభిషేకం



ద్వారకాతిరుమల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రి పర్వదినం పురస్క రించుకుని ద్వారకా తిరుమల క్షేత్ర పాలకుడైన శివదేవుని ఆలయంలో గురువారం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చ కులు,పండితులు వేద మంత్రోచ్ఛరణల నడుమ పంచా మృతాలతో అభిషేకం జరిపారు. రాత్రి మేళ తాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

తెల్ల బంగారం వెలవెల



తగ్గిపోతున్న పత్తి సాగు

అతివృష్టి, అనావృష్టితో దిగుబడుల్లేవు

గిట్టుబాటు ధర కూడా కరువు

ఇదే పరిస్థితి కొనసాగితే కనుమరుగే

కుక్కునూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో జీవచ్ఛవంలా మారిన పత్తిపంటకు తిరిగి ప్రాణం పోయాల్సిన అవసరం ఉంది. ఈనెల 20, 21, 22 తేదీల్లో మూడురోజుల పాటు గుంటూరు సమీపంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన అఖిల భారత పత్తి వార్షిక సమావేశంలో జాతీయ శాస్త్రవేత్తలు వెలుబుచ్చిన అభిప్రాయం ఇది. ప్రతీ ఏటా పత్తి ఉత్పత్తి 15 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా కనిష్ఠ స్థాయికి చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లాలోనే ఏజెన్సీ ప్రాంతమైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని నల్లరేగడి భూముల్లో తెల్ల బంగారంగా పిలుచుకునే పత్తిసాగు ఒకప్పుడు విస్తారంగా సాగేది. ఇక్కడ పంచే పత్తికి గుంటూరు, తదితర ప్రాంతాల్లో విపరీతమైన డిమాండ్ ఉండేది. కానీ కాలక్రమేణా పత్తిసాగు విస్తీర్ణం పడిపోతుంది. గతంలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో నల్లరేగడి భూముల్లోని దాదాపు 15 వేల ఎకరాల విస్తీర్ణంలో పత్తి సాగయ్యేది. కానీ నేడు పరిస్థితులు మారిపోయాయి. వాతావరణ పరిస్థితులతో పాటు ఏటా ముంచెత్తుతున్న గోదావరి వరదలే దీనికి కారణం.పంట చేతికి అందే సమయంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు, మరో ఏడాది అనావృష్టితో సమయానుకూలంగా వర్షాలు లేకపోవడంతో దిగుబడిపై ప్రభావం చూపుతోంది. ఒకప్పుడు ఎకరానికి 12 క్వింటాళ్ల నుంచి 20 క్వింటాళ్ల లోపు దిగుబడి వచ్చేది. ఇప్పుడు మారిన వాతావరణ పరిస్థితులు, తెగుళ్లతో ఎకరానికి పది క్వింటాళ్ళకు మించి దిగుబడి రావడం లేదు. ఒక వేళ దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర ఉండటం లేదు. మూడేళ్ళుగా పత్తిధరలు పరిశీలిస్తే క్వింటా ప్రత్తి .రూ.6 వేల నుంచి 7,500 వరకు ధర పలికింది. పెరిగిన కౌలు ధరలతో పాటు ఎరువులు, పురుగు మందుల ధరలు, కూలిధరలు, పెట్టుబడి విపరీతంగా పెరిగింది. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా గిట్టుబాటు ధర లేకపోవడంతో పత్తిసాగు రైతాంగానికి ఏ మాత్రం ఉపయోగకరంగా లేదు. పత్తిపంట సాగు చేయాలంటే ఎకరానికి దాదా పుగా రూ.60 వేలు పైగా ఖర్చవుతుంది. కానీ దిగుబడి పది క్వింటాళ్లలోపే వస్తుండటంతో పెట్టిన పెట్టుబడి కూడా రాక చేసిన అప్పులు కూడా తీర్చలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పత్తిసాగు ఏజెన్సీలో క్రమంగా తగ్గిపోతున్నది. గత మూడేళ్లుగా చూస్తే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 2021లో 15 వేల ఎకరాల్లో, పత్తి సాగవగా 2022 10 వేల ఎకరాలు, 2023లో 7 వేల ఎకరాల్లోనూ, 2024లో ఐదు వేల ఎకరాలకు సాగు పడిపోయింది. శాస్త్రవేత్తలు సూచించిన ప్రకారం వాతావరణ పరిస్థితులు తట్టుకునేలా కొత్తరకమైన పత్తి వంగడాలు రావాలి. తక్కువ వ్యవధిలో పంటకు చేతికి వచ్చేలా బీటీ వంగడాలు, సాగు విధానంలో మార్పులు, సేద్యంలో నైపుణ్యాన్ని పెంపొందించుకో వడం ద్వారా రైతులు లాభాలు పొందవచ్చని కుక్కునూ వ్యవసాయాధికారి బాలాజీ చెప్పారు.

- **ప్రతీ ఏటా సాగుతో నష్టాలే**



నాలుగేళ్లుగా పత్తి రైతాంగానికి నష్టాలే మిగులు తున్నాయి. కష్టపడి పండించిన పండిన పంటకు సరైన గిట్టుబాటు ధర ఉండటం లేదు.ఖర్చు పెరుగుతుంది. కానీ ఆదాయం మాత్రం రాకపోవడంతో నష్టాలో ఊబిలో కూరుకు పోతున్నాం.

-మడకం వీరయ్య, ఇసుకపాడు

- **గిట్టుబాటు ధర కల్పిస్తేనే మేలు**



పెట్టుబడి పెరిగిపోతుంది. గిట్టుబాటు ధర ఉండటంలేదు. దీంతో రైతులకు ప్రత్తిసాగు చేయాలంటేనే ఆసక్తిపోతుంది. అలాగే క్రమంగా ప్రత్తిసాగును వదిలి జామాయిల్ సాగు వైపు రైతాంగం ఆసక్తి కనపరుస్తున్నారు. పత్తిసాగుతో లాభాలు వస్తేనే రైతాంగానికి మేలు జరుగుతుంది.

-ఎట్టి వెంకన్న, లంకాలపల్లి గ్రామం

నేడు, రేపు వేడిగాలుల తీవ్రత

ఏలూరుసిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఈనెల 28, 29 తేదీల్లో వేడిగాలులతో వాతావరణం వేడెక్కనుంది. ఈ రెండు రోజుల్లో ఏలూరు జిల్లాలోని ఐదు మండలాల్లో అత్యంత తీవ్రమైన వేడిగాలులు ప్రభావం ఉంటుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ గురువారం తెలిపింది. మిగిలిన మండలాల్లో వేడిగాలులు వీస్తాయన్నారు. 29న 16 మండలాల్లో వేడిగాలులు వీచే అవకాశాలున్నాయని తెలిపింది. ఇక పశ్చిమ గోదావరి జిల్లాలో ఈనెల 28న 12 మండలాల్లోను, 29న 6 మండలాల్లోను, ఉమ్మడి పశ్చిమలోని తూర్పు గోదావరి జిల్లాలో ఈనెల 28న 8 మండలాల్లోను, 29న 8 మండలాల్లోను వేడిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపింది.

- ఏలూరు జిల్లాలో ఈనెల 28న ఆగిరిపల్లి మండలంలో 43.4 డిగ్రీలు, బుట్టాయిగూడెంలో 42.5 డిగ్రీలు, జంగారెడ్డిగూడెంలో 42.3 డిగ్రీలు, పోలవరంలో 43.4 డిగ్రీలు, వేలేరుపాడులో 43.7 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని తెలిపింది. ఈనెల 29న ఆగిరిపల్లి, భీమడోలు, బుట్టాయిగూడెం, ద్వారకాతిరుమల, ఏలూరు, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కుక్కునూరు, మండవల్లి, ముసునూరు, నిడమర్రు, నూజివీడు, పెదవేగి, పోలవరం ఉంగుటూరు, వేలేరుపాడు మండలాలలో వేడిగాలులు వీస్తాయని తెలిపింది.
- పశ్చిమ గోదావరి జిల్లాలో ఈనెల 28న ఆచంట, ఆకివీడు, అత్తిలి, ఇరగవరం, పాలకోడేరు పెంటపాడు, పెనుగొండ, పెనుమంత్ర, గణపవరం, తాడేపల్లిగూడెం, తణుకు, ఉండి మండలాల్లోనూ, ఈనెల 29న ఆకివీడు, ఇరగవరం, పెంటపాడు, తాడేపల్లిగూడెం, గణపవరం, తణుకు మండలాల్లో వేడిగాలుల ప్రభావం ఉంటుంది.
- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని తూర్పుగోదావరి జిల్లాలో ఈనెల 28న చాగల్లు, దేవరపల్లి, కొవ్వూరు, నల్లజర్ల, నిడదవోలు, పెరవలి, తాళ్ళపూడి, ఉండ్రాజవరం మండలాల్లోను, ఈనెల 29న చాగల్లు, దేవరపల్లి, కొవ్వూరు, నల్లజర్ల, నిడదవోలు, పెరవలి, తాళ్ళపూడి, ఉండ్రాజవరం మండలాల్లో వేడిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపింది.

ఏలూరు జిల్లా ఎస్పీ, జేసీ విదేశీ పర్యటన

- నేటి నుంచి ఏప్రిల్ మూడో తేదీ వరకు సెలవు
- ఇన్‌చార్జి ఎస్పీగా 'పశ్చిమ' జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

ఏలూరు క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆయన సతీమణి జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి వ్యక్తిగతంగా విదేశీ పర్యటన దృష్ట్యా సెలవు తీసుకున్నారు. ఈనెల 28వ తేదీ నుంచి ఏప్రిల్ మూడో తేదీ వరకు వారిద్దరికి సెలవులు మంజూరు చేసి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆయన సతీమణి జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి వియత్నాం దేశానికి పర్యటనకు వెళ్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఏలూరు ఇన్‌ఛార్జి జిల్లా ఎస్పీగా పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి బాధ్యతలను నిర్వర్తించనున్నారు.

108 కేసుల్లో రూ.14.36 లక్షల నష్టపరిహారం అందించాం

- ఏపీఈపీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

పెదపాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ వినియోగదారుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం పనిచేస్తుందని కన్స్యూమర్స్ గ్రీవెన్స్ ఫోరమ్ (సీజీఆర్ఎఫ్) చైర్మన్ బీవీ సత్యనారాయణ తెలిపారు. గురువారం పెదపాడు విద్యుత్ శాఖ కార్యాలయంలో దెందులూరు నియోజకవర్గ స్థాయి విద్యుత్ వినియోగదారుల సమస్యలపై 'సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వినియోగదారుల నుంచి పలు అర్జీలను స్వీకరించి మాట్లాడారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు జిల్లా పరిధిలో ఇప్పటివరకు 107 క్యాంపులు నిర్వహించామని, గురువారం 26 ఫిర్యాదులు అందాయని, గతేడాది 567 ఫిర్యాదులు అందగా, ఈ ఏడాది మార్చి వరకు 268 ఫిర్యాదులు అందాయన్నారు. ఇంకా 144 పెండింగ్‌లో వున్నాయన్నారు. 108 కేసుల్లో ఫిర్యాదుదారులకు రూ.14,36,950 నష్టపరిహారం అందించామన్నారు. 1912 టోల్‌ఫ్రీ నంబరుకు లేదా ఫిర్యాదులను నేరుగానే కాకుండా సమగ్రంగా తెలుపుతూ విశాఖపట్నంలోని కార్యాలయానికి పోస్టు ద్వారా పంపినా వాటిపై విచారణ జరిపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మెంబర్ ఫైనాన్స్ షేక్ బాబర్, మెంబర్ ఇండిపెండెంట్ ఎన్.మురళీకృష్ణ, డీఈ అంబేడ్కర్, ఏడీ శ్రీనివాస్, ఏఈ వై.రాంబాబు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ


సీఈవో డాక్టర్ వడ్లమూడి రోజాను సత్కరిస్తున్న ఏపీ నిట్ ఆచార్యులు

దేశ రూపురేఖలు మార్చే శక్తి యువతదే

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : దేశ రూపురేఖలు మార్చే శక్తి యువతదేనని ట్రివర్గిన్స్ టెక్నో ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ(చెన్నై) సీఈవో డాక్టర్ వడ్లమూడి రోజా అన్నారు. ఏపీ నిట్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం సహకారంతో డీన్ అకడమిక్ డాక్టర్ ఎన్.జయరాం అధ్యక్షతన స్టార్టప్ ఐడియా ఎక్స్‌పో (జెనిసిస్-2025) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సృజనశీల వ్యాపార ఆలోచనలకు ఆకృతినిస్తే అంకుర పరిశ్రమలు ఊపిరి పోసుకుంటాయన్నారు. అనంతరం డీన్‌లు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరాం మాటాడారు. ఈ సందర్భంగా ఏపీ నిట్ విద్యార్థులతోపాటు, కేఎల్ యూనివర్శిటీ, పీవీపీ సిద్ధార్థ కళాశాల, శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల, లెండి ఇంజనీరింగ్ కళాశాల తదితర కళాశాలల విద్యార్థులు చేసిన 96 ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రాజెక్టుల విజేతలకు నగదు బహుమతి అందజేశారు. అనంతరం సీఈవో రోజాను జ్ఞాపికతో సత్కరించారు. ఆచార్యులు పి.శంకర్, డాక్టర్ టి.కిరణ్, డాక్టర్ ఫణికృష్ణ, డాక్టర్ వీఎల్ఎన్.శాస్త్రి, డాక్టర్ పీఎస్వీకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క నుంచి కంపోస్టు తయారీ

సిద్దాపురంలో పైలట్ ప్రాజెక్టు : వ్యవసాయశాఖ జేడీ వెంకటేశ్వరరావు

ఆకివీడురూరల్ మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గుర్రపుడెక్క నుంచి కంపోస్టు తయారీకి కార్యచరణ చేస్తున్నట్టు వ్యవసాయశాఖ జేడీ వెంకటేశ్వరరావు తెలిపారు. సిద్దాపురంలోని డంపింగ్ యార్డును ఆయన వ్యవసాయశాఖ సిబ్బంది, డ్వాక్రా సిబ్బందితో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. కాలువలలో పేరుకుపోయిన గుర్రపుడెక్కలో అనేక పోషకాలుంటాయని, దీనిని ఎరువుగా చేసుకుని ఉపయోగించుకుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కాలువలలో పేరుకుపోయిన గుర్రపుడెక్కకు అయ్యే ఖర్చు తగ్గుతుందన్నారు. ఏడు అడుగుల పొడవు, మూడు అడుగులు వెడల్పు, 2.5 అడుగుల లోతు గల కంపోస్టు పిట్‌లో ఒక అంగుళం మందంలో పశువుల ఎరువును వేసుకోవాలని తెలిపారు. దానిపై ఐదు అంగుళాల మందంలో కట్ చేసిన గుర్రపుడెక్క వేసుకోవాలి, దీనిపై రెండు అంగుళాల పశువుల పేడను వేసుకుని పైన కొంత ఖాళీ ఉంచుకోవాలన్నారు. కంపోస్టు త్వరగా కుళ్లడానికి డీకంపోజర్స్ ఉపయోగించుకోవచ్చని సూచించారు. ఈవిధంగా తయారు చేస్తే ఏడు నుంచి ఎనిమిది వారాలలో కంపోస్టు తయారవుతుందని తెలిపారు. ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో ప్రియాంక, ఏపీఎం శేషవేణి, డ్వాక్రా మహిళలు తదితరులున్నారు.


సిద్దాపురంలో డ్వాక్రా సిబ్బందికి సూచనలు చేస్తున్న జేడీ వెంకటేశ్వరరావు

'టెన్త్' మూల్యాంకనమూ ఓ పరీక్షే !



విధుల మినహాయింపునకు టీచర్ల దొడ్డిదారి ప్రయత్నాలు

- స్వల్పకాలిక అనారోగ్యానికి దీర్ఘకాలిక రోగ మెడికల్ సర్టిఫికెట్లు
- టీచర్ సంఘాల నాయకుల రికమండేషన్లు
- వందల సంఖ్యలో విధుల మినహాయింపునకు అభ్యర్థనలు
- గందరగోళంలో జిల్లా విద్యాశాఖ అధికారులు

ఏలూరు అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకన ప్రక్రియను సజావుగా నడిపించడం జిల్లా విద్యాశాఖ అధికారులకు ఓ పరీక్షలా మారింది. మూల్యాంకన విధుల నుంచి మినహాయింపునకు ఉపాధ్యాయులు సమర్పిస్తున్న అభ్యర్థనలు, మెడికల్ సర్టిఫికెట్లు విస్తుపోయేలా ఉండడంతో అధికారులు గందరగోళంలో ఉన్నారు కీళ్ల నొప్పికి గుండె జబ్బు ధ్రువీకరణపత్రం, స్వల్పకాలిక అనారోగ్యానికి దీర్ఘకాలిక రోగ మెడికల్ సర్టిఫికెట్... ఈవిధంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకన విధులనుంచి మినహాయింపునకు కొందరు టీచర్లు సమర్పించిన అభ్యర్థనలు. వీటితో పాటు తమ యూనియన్లకు చెందిన ఉపాధ్యాయులంటూ మరికొందరు టీచర్ సంఘాల నాయకులు తెచ్చిపడేస్తున్న రికమండేషన్లు మరికొన్ని. మరోవైపు రెగ్యులర్ పరీక్షల జవాబుపత్రాలతోపాటే ఏకకాలంలో సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య టెన్త్ పరీక్షల పత్రాలనుకూడా మూల్యాంకన చేయాల్సిన పరిస్థితులు. ఈ క్రమంలో ఏప్రిల్ మూడు నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి మూల్యాంకన ప్రక్రియను సక్రమంగా నిర్వహించడం జిల్లా విద్యాశాఖ అధికారులకు ఓ పరీక్షలా మారింది. పలు జిల్లాలనుంచి సుమారు 1.84 లక్షల ఆన్సర్ స్క్రిప్టులు మూల్యాంకన నిమిత్తం ఏలూరు జిల్లాకు కేటాయించే అవకాశాలున్నాయి. వీటికి దూరవిద్య టెన్త్ జవాబుపత్రాలు అదనం. నిర్దేశిత షెడ్యూలు ప్రకారం మూల్యాంకన ప్రక్రియ ఏప్రిల్ మూడు నుంచి తొమ్మిదో తేదీ వరకు జరగాల్సిఉంది. ఆన్సర్ స్క్రిప్టుల మూల్యాంకనానికి అన్ని సబ్జెక్టులనుంచి సుమారు 2,100 మంది స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులు అవసరం ఉందని గుర్తించారు. జిల్లాలోని అన్ని హైస్కూళ్లు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 2,162మంది స్కూల్ అసిస్టెంట్లు అన్ని సబ్జెక్టుల్లో ఉన్నారు. ఆ ప్రకారం రెగ్యులర్ విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనానికి కావలసిన స్కూల్ అసిస్టెంట్లకు స్పాట్ వాల్యూయేషన్ విధులు కేటాయిస్తే, ఇంకా 62మంది మాత్రమే ఉంటారు. వీరిలో పలువురు ఇప్పటికే మెడికల్ లీవులు, ఇతర కారణాలపై సెలవులపై ఉన్నారు. ఇక మిగిలివున్న స్కూల్ అసిస్టెంట్లందరికీ మూల్యాంకన విధులు కేటాయించాల్సిన తప్పని పరిస్థితులున్నాయి.

వందల సంఖ్యలో అభ్యర్థనలు

తాజా పరిణామాలు పరిశీలిస్తే మూల్యాంకన విధులకు మినహాయింపులుకోరే అభ్యర్థనలు వందలసంఖ్యలోనే ఉన్నాయి. ఇవి ఇంకా వస్తూనేఉన్నాయి. నిబంధనల ప్రకారం దీర్ఘకాలిక వ్యాధులు, తీవ్ర అనారోగ్యం, ఇతర సహేతుక కారణాలపై స్పాట్ విధులనుంచి మినహాయింపులు ఇచ్చే అధికారం విద్యాశాఖకు ఉంది. ఈ కోవలోనే మినహాయింపుల నిమిత్తం పలువురు టీచర్లు అభ్యర్థనలకు జతచేసిన వైద్యధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన విద్యాశాఖ అధికారులు విస్తుపోయేలా కొన్ని పత్రాలున్నాయి. నిజంగా తీవ్ర అనారోగ్యపరిస్థితుల్లో వున్న వారికి మినహాయింపులు ఇవ్వడంలో అభ్యంతరాలు చెప్పబోమని, కాని కొందరు మూల్యాంకన విధులకు దూరంగా ఉండేందుకు తెస్తున్న ఒత్తిళ్లతో స్పాట్ వాల్యూయేషన్‌ను ఎలా నిర్వహించగలమని విద్యాశాఖ సందేహిస్తోంది. దూరవిద్య టెన్త్ జవాబు పత్రాలను మూల్యాంకన చేయాల్సి రావడం ఉపాధ్యాయుల కొరతను మరింతగా పెంచుతోంది.

- జిల్లా విద్యాశాఖ వర్గాలను దీనిపై వివరణ కోరగా 'నిబంధనల ప్రకారమే స్పాట్ విధులనుంచి మినహాయింపులపై నిర్ణయం తీసుకుంటాం. సహేతుక కారణాలులేకుండా మూల్యాంకన విధులకు రాలేమంటే ఒప్పుకోం. పరిమితులతోకూడిన మినహాయింపులు ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నాం. అర్హులైన వారితోనే మూల్యాంకన జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటాం. ఎవరి ఒత్తిళ్లకూ లొంగేదిలేదు. ఇప్పటివరకు ఎవరికీ మినహాయింపులు ఇవ్వలేదు.' అని వివరించాయి.

46 ప్రైవేటు బస్సులపై కేసులు

రూ.1.13 లక్షల జరిమానా విధించిన రవాణా శాఖ అధికారులు

ఏలూరు క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మోటారు వాహన నిబంధనలు అతిక్రమించిన 46 కాంట్రాక్టు బస్సులు (ప్రైవేటు ట్రావెల్స్)పై కేసులు నమోదు చేసి లక్షా 13 వేల రూపాయలు అపరాధ రుసుము విధించామని ఏలూరు జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ షేక్‌కరీమ్ తెలిపారు. ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్‌గేటు వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం ఆరు గంటల వరకు నిరవధికంగా ప్రైవేటు కాంట్రాక్టు బస్సుల తనిఖీలను నిర్వహించామన్నారు. రహదారి భద్రతలో భాగంగా డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించి వారికి రహదారి భద్రతపై అవగాహన కల్పించామన్నారు. డ్రైవింగ్ విరామ సమయంలో డ్రైవర్లు తప్పకుండా విశ్రాంతి తీసుకోవాలని హితవు పలికారు. ఈ తనిఖీలలో వాహన తనిఖీ అధికారు బీమారావు, ఎస్‌డీ విఠల్, ఎస్వీ శేఖర్, జి.ప్రసాదరావు పలువురు పాల్గొన్నారు.


ప్రైవేటు బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

తాడేపల్లిగూడెంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల బృందం దాడులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెంలో కల్తీ పదార్థాలతో ప్రజల ప్రాణాలను హరిస్తున్న హోటల్స్, స్వీట్స్ స్టాల్స్, మిల్క్ డైరీలపై మునిసిపల్ అధికారులు, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ల బృందం సంయుక్తంగా గురువారం దాడులు నిర్వహించాయి. ఈనెల 20న ఆంధ్రజ్యోతిలో 'బయట తింటే ఆరోగ్యం గల్లంతే' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎ.రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు సంయుక్త ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలోని ఫుడ్ స్టాల్స్, హోటల్స్‌లో దాడులు నిర్వహించారు. దాడుల్లో భాగంగా గొల్లగూడెం సెంటర్‌లోని ఓ రెస్టారెంట్‌లో కుళ్లిపోయిన చికెన్ పదార్థాలు, ఫ్రిజ్ ఐస్‌లో మునిగిపోయిన ఇతర పదార్థాలు తారసపడ్డాయి, మిల్క్ డైరీలో ప్రజల ప్రాణాలకు అపాయం కలిగించే కెమికల్స్ కనిపించాయి. భీమవరంరోడ్డులోని ఓ స్వీట్ స్టాల్‌లో కేకులు, స్వీట్లు, ఇతర పిండి వంటలలో హానికరమైన రంగులు గుర్తించారు. ఆ పదార్థాలన్నింటిని సీజ్ చేసి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు తరలించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


కుళ్లిన చికెన్ చూపిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామిరెడ్డి

మంచినీటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి

డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ వెంకటకృష్ణ

ఆకివీడురూరల్ మార్చి 27(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛమైన మంచినీటిని ప్రజలకు అందించేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ వెంకటకృష్ణ అన్నారు. తన స్వగ్రామమైన ఆకివీడు మండలం పెదకాపవరంలో గురువారం ఆయన పర్యటించారు. వెంకయ్యవయ్యేరు కాలువ నుంచి మంచినీటి చెరువు వరకు ఉన్న పైపులైను మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిల్టర్‌బెడ్‌లలో ఇసుకను మార్చాలని సూచించారు. మైక్రో ఫిల్టర్‌లను ఆయన పరిశీలించారు. గ్రామంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉన్నప్పటికి వినియోగించుకోలేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పన్నులు వసూలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గతంలో చేసిన పనులు వివరాల రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ సలహాదారు తోట ప్రభాకర్, డీపీవో అరుణశ్రీ, ఆర్‌డబ్ల్యూస్ ఈఈ నాగేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, సర్పంచ్ బేబీస్నేతు, పాతపాటి శ్రీనివాసరాజు, కఠారి కేశవ, కఠారి రాము తదితరులు ఉన్నారు.


పెదకాపవరంలో మంచినీటి పథకాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ వెంకటకృష్ణ, ప్రభుత్వ సలహాదారు తోట ప్రభాకర్

క్రైమ్ కార్నర్

తాటాకిల్లు మంటల్లో గాయపడి.. ఒంటరి వృద్ధ మహిళ మృతి


సరోజిని(ఫైల్)

పోడూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కట్టెల పొయ్యిమీద వంట చేసుకుని పొయ్యి ఆర్పకుండా నిద్రిస్తున్న ఒంటరి వృద్ధ మహిళ వర్ధనపు సరోజిని(72) తన తాటాకిల్లు మంటల్లోనే గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. తహసీల్దార్ ఎస్ఎం.ఫాజిల్ తెలిపిన వివరాలివి.. పోడూరు మండలం గుమ్మలూరు పంచాయతీ పరిధిలోని పెదపేట ఏరియాలోని తాటాకు ఇంటిలో అనారోగ్యంతో ఆమె ఒంటరిగా ఉంటుంది. బుధవారం సాయంత్రం కట్టెల పొయ్యపై వంట చేసుకుని పొయ్య ఆర్పకుండా ఇంట్లోకి వెళ్లిపోయింది. రాత్రి 11 గంటల సమయంలో మంటలు చెలరేగి తాటాకిల్లు దగ్ధమైంది. ఆమె అనారోగ్యం కారణంగా బయటకు రాలేకపోవడంతో స్థానికులు వచ్చి చూసేసరికి ఇల్లు పూర్తిగా కాలిపోయి ఆమె అక్కడకక్కడే మృతి చెందినట్టు తెలిపారు. ఎస్ఐ సుధాకరరెడ్డి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఏలూరు క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కడుపునొప్పి బాధ భరించలేక ఓ వ్యక్తి పురుగుల మందుతాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఏలూరు సమీపంలో వట్లూరుకు చెందిన సనపాల పెద్దిరాజు (49)కి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహాలు అయ్యాయి. కొంతకాలం నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఈనెల 26న ఉదయం తన ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. సాయంత్రం గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఆసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఫార్మాసిస్టు ఆత్మహత్యాయత్నం కేసులో నిందితుడు దీపక్ అరెస్ట్

- ఇంకా బాధితులుంటే సమాచారం ఇవ్వండి : డీఎస్పీ భవ్య కిషోర్
- కండీషన్ సీరియస్‌గానే ఉంది : వైద్యులు

రాజమహేంద్రవరం/జీలుగుమిల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ బొల్లినేని ఆస్పత్రిలో ఫార్మాసిస్టుగా పనిచేస్తున్న నల్లపు నాగాంజలి ఆత్మహత్యాయత్నం కేసులో నిందితుడిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సౌత్‌జోన్ డీఎస్పీ ఎస్.భవ్య కిషోర్ వివరాలను వెల్లడించారు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెంకు చెందిన నల్లపు దుర్గారావు కుమార్తె నాగాంజలి వికాస్ ఫార్మసీ కళాశాలలో ఫార్మ్-డి ఫైనలియర్ చదువుతోంది. ప్రకాశ నగర్‌లోని కిమ్స్ బొల్లినేని ఆస్పత్రిలో తొమ్మిది నెలల నుంచి ఫార్మాసిస్టుగా పని చేస్తోంది. అదేఆస్పత్రిలో ఏజీఎం/ మెడికల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న దువ్వాడ మాధవరావుదీపక్ కార్యాలయం పక్కన ఉన్న ఒక గదిలో ఉం టోంది. పది రోజుల కిందట యువతి తండ్రి దుర్గారావు కుమార్తె గదికి వెళ్లిన సమయంలో ఆమె నీరసంగా ఉండడం గమనించి ప్రశ్నించారు. దీపక్ అనే వ్యక్తి తనను ప్రేమ పేరుతో మోసగించి వేధింపులకు పాల్పడుతున్నట్టు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. ఇదిలా ఉండగా ఈనెల 23న నాగాంజలి కళ్లు తిరిగి పడిపోయిందని తండ్రి ఫోన్ చేయగా బంధువులతో కలిసి వచ్చి చూడగా అపస్మారక స్థితిలో ఉందన్నారు. ఆమె గదిలోని డైరీలో లభించిన సూసైడ్ నోట్‌లో దీపక్ తనను మోసగించాడని.. అతడి టార్చర్ భరించలేక వేక్యూనోరియం బ్రోమైడ్ 10 ఎంజీ ఇంజక్షన్ తీసుకున్నానని.. తన చావుకు అతడే కారణమని రాసినట్టు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దీపక్‌ని నిందితుడిగా గుర్తించామని డీఎస్పీ తెలిపారు. అతడు పరారీలో ఉండడంతో ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాలతో ప్రకాశం నగర్ సీఐ ఆర్ఎస్‌కే బాజీలాల్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా పెట్టామన్నారు. తమకు అందిన సమాచారంతో నిందితుడు దీపక్‌ని గురువారం ఉదయం రాజమహేంద్రవరంలో సీఐ బాజీలాల్ అరెస్టు చేశారన్నారు. దీపక్ బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాధితురాలు, నిందితుడి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. బాధితురాలి ఫోన్‌లో డేటా డిలీట్ చేశారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని.. ఇప్పటికే సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ సైన్సు ల్యాబ్‌కి పంపించామని చెప్పారు. ఒకవేళ అలాంటిది ఏమైనా జరిగినా డేటాను రిట్రీవ్ చేయిస్తామన్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి యాజమాన్యంతో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆరా తీశారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యకిషోర్

పరిస్థితి విషమంగానే ఉంది : డాక్టర్ దీపక్

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగాంజలి పరిస్థితి విషమంగానే ఉందని కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి జనరల్ మెడిసిన్ వైద్యుడు దీపక్ తెలిపారు. గురువారం డాక్టర్ రామరాజుతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. బ్రెయిన్‌కి రక్త సరఫరా తగ్గడం వల్ల డ్యామేజీ అయ్యిందని, బ్రెయిన్‌డెడ్ కాలేదని చెప్పారు. రికవరీ అవకాశాలు చాలా తక్కువ ఉన్నాయన్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి


సేట్రామ్ మృతదేహం

ద్వారకాతిరుమల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అతి వేగంగా నిర్లక్ష్యంగా నడుపుతున్న ఓ కారు రోడ్డుపై నడిచి వెళ్తున్న ఓ వ్యక్తిని ఢీకొంది. ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ టి.సుధీర్ తెలిపిన వివరాలివి.. తెలంగాణలోని కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కరగవాడకు చెందిన బట్టు సేట్రామ్(55) లక్ష్మీనగర్‌లోని సింధూర పేపర్ మిల్లులో వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. గురువారం రాత్రి అతడి బంధువు బట్టు కృష్ణతో కలిసి టీ తాగేందుకు గాను రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో కొవ్వూరు వైపు నుంచి ఏలూరు వైపు వెళ్లే కారు అతడ్ని వేగంగా ఢీకొట్టింది. సేట్రామ్ అక్కడి కక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను ఢీకొట్టిన కారు యజమానిపై కేసు

ఉండి, మార్చి27(ఆంధ్రజ్యోతి) : మహిళను కారుతో ఢీకొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఉండి ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఉండి గ్రామానికి చెందిన నవుతు పెద్దింట్లు ఉండిలోని రాజుగారి హోటల్‌లో స్వీపర్‌గా పనిచేస్తుంది. బుధవారం మధ్యాహ్నం హోటల్ బయట కూర్చుని వుండగా అతివేగంగా వచ్చిన కారు ఆమెను ఢీకొట్టింది. ఆమె కాలు విరగడంతో భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

చర్చి ప్రహరీ కూల్చివేత

సరిహద్దుదారుడిపై క్రైస్తవుల ఆగ్రహం

ద్వారకాతిరుమల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): చర్చి ప్రహరీని సరిహద్దుదారుడు కూల్చిన ఘటన గురువారం దొరసానిపాడులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. గ్రామంలో ఏసు ప్రార్థన మందిరాన్ని 2008లో సంఘసభ్యులు సొంత స్థలంలో నిర్మాణం చేపట్టామని, మందిరం చుట్టూ 2017లో సరిహద్దుదారుడు అల్లాడ రాజేష్ సమక్షంలోనే ప్రహరీ నిర్మించామన్నారు. ఆ సమయంలో అభ్యంతరం పెట్టని అతడు గురువారం ఆ గోడ తమ స్థలంలో ఏర్పాటు చేశారని ఎక్స్‌కవేటర్‌తో కూల్చి వేశాడు. అతడిపై చట ప్రకారం చర్యలు తీసుకోవాలని సంఘ సభ్యులు బి.శ్రీనివాసరావు, ఇబ్బ వెంకటలక్ష్మి, ఇబ్బా రంగమ్మ అల్లాడ మాణిక్యం, కోటేశ్వరి, సత్యనారాయణ తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


దొరసానిపాడులో కూల్చిన చర్చి ప్రహరీ

ఉంగుటూరు తహసీల్దార్‌గా రవికుమార్

ఏలూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు తహసీల్దార్‌గా పి.రవికుమార్ నియమితులయ్యారు. ఏపీ సెక్రెటేరియట్‌లో మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రవికుమార్‌ను రెండేళ్ల కాలానికి తహసీల్దార్‌గా నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉంగుటూరు తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటంతో డిప్యూటీ తహసీల్దార్ ఇక్కడ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

చిన్నారులకు బేబీ కిట్లు పంపిణీ చేసిన రామ్ చరణ్ అభిమానులు

ఏలూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు రామ్‌చరణ్ పుట్టిన రోజు వేడుకలను గురువారం రామ్‌చరణ్ యువశక్తి, మెగా అభిమానులు, జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చిన్న పిల్లల వార్డులో చిన్నారులకు బేబీ కిట్‌లు, పండ్లు పంపిణీ చేశారు. నారా శేషు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పత్తేబాదలోని నిశ్చింత వృద్ధాశ్రమంలో భోజనం అందజేశారు. కాశీ నరేష్, గౌరీశంకర్, వీరంకి పండు, శానం శ్రీరామకృష్ణ, హిమబిందు, తేజస్విని పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌తో గన్ని వీరాంజనేయులు భేటీ



లోకేశ్‌ను కలిసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని

ఏలూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పార్టీ వ్యవహారాలపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేశ్‌తో గురువారం భేటీ అయ్యారు. ఇప్పటి దాకా నెలకొన్న పరిస్థితులు, పార్టీ పరంగా తీసుకుంటున్న నిర్ణయాలపై వారి మధ్య 20 నిమిషాలకు పైగా చర్చ సాగింది. ఇప్పటికే వివిధ నియోజకవర్గాల్లో స్థానిక నేతల డిమాండ్లు, ఆయా ప్రాంతాల్లో పార్టీ మరింత పటిష్ఠం అయ్యేలా చేసిన సూచనలను లోకేశ్ దృష్టికి తెచ్చారు.

కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్



ఏలూరు టూటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీ మహేశ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో గురువారం కొల్లేరు సమస్యలపై మాట్లాడారు. కొల్లేరు సరస్సు ప్రాధాన్యతను పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లారు. కొల్లేరు ప్రాం త హద్దులు నిర్ణయించడం వలన సన్న, చిన్నకారు రైతులు 21ఎకరాల భూమిని కోల్పోతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారన్నారు. పార్లమెంట్‌లో వలసలు, విదేశీ బిల్లుపై గురువారం జరిగిన చర్చల్లో మహేశ్‌కుమార్ పాల్గొన్నారు. బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలిపారు.

సీఎం దృష్టికి పోలవరం నిర్వాసితుల సమస్యలు



సీఎంతో సమావేశంలో పాల్గొన్న పోలవరం నిర్వాసితులు

కుక్కునూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టు సందర్శనలో గురువారం నిర్వాసితులతో సమావేశంలో నిర్వహించారు. నిర్వాసితుల సమస్యలను నాయకులు ఏకరువు పెట్టారు. 2017 ఆగస్టు నాటికి 18ఏళ్లు నిండిన యువతకు కటాఫ్ తేదీ నిర్ణయించి పరిహారానికి అర్హులను చేశారన్నారు. పరిహారం ఇప్పుడు చెల్లిస్తున్న క్రమంలో ప్రస్తుత తేదీని పరిగణనలోకి తీసుకుని 18 ఏళ్లు నిండిన అందరికి పరిహారానికి అర్హులను చేయాలన్నారు. ప్రతీ ఏడాది గోదావరి వరదలకు మునుగుతున్న గ్రామాలను కూడా 41.15 కాంటూరు లెవెల్‌లో చేర్చి పునరావాస పరిహారం చెల్లించాలన్నారు. స్థానికంగా ఉండడం లేదని వందలాది మంది నిర్వాసితుల పేర్లు జాబితాలో తొలగించారని, వాటిని కూడా పరిశీలించి ఆర్ అండ్ ఆర్ పరిహారం అందించాలని సీఎంను కోరారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల వెబ్‌ల్యాండ్ మూసివేశారని, మిగిలిఉన్న భూముల రైతాంగానికి ఫలితాలు అందడం లేదని వివరించారు. సీఎం సానుకూలంగా స్పందిస్తూ ప్రతీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, జనసే న అధ్యక్షుడు యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, కోటగిరి సత్యనారాయణ, పిచ్చుక రాజు, శ్రీను పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

కుక్కునూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కే.గౌస్ అన్నారు. గురువారం కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. కల్లయ్య, ప్రశాంత్, ఎం.సుభద్ర, సుజాత, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే బోదవ్యాధి నియంత్రణ : డీఎంవో



బాధితులకు మార్బిడిటీ కిట్లను అందజేస్తున్న డీఎంవో

ఏలూరు అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బోదవ్యాధి బాధితులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్ సూచించారు. కొత్తపేట అర్బన్ పీహెచ్‌సీలో 45 మంది బోదవ్యాధి బాధితులకు గురు వారం మార్బిడిటీ మేనేజ్‌మెంట్ కిట్ల ను ఆయన పంపిణీ చేశారు. బోద వ్యాధిని నియంత్రించడానికి పరిశుభ్రత ఒక్కటే మార్గమన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ బోదవ్యాధి బాధితులు ఎండలో ఎక్కువసేపు ఉండరాదన్నారు. డాక్టర్ శశాంక్ పరిశుభ్రత చర్యలు డెమో ద్వారా బాధితులకు చూపించారు. వైద్య సిబ్బంది నాగమల్లేశ్వరరావు, మార్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దీపు హత్యపై ట్రాన్స్‌జెండర్ల నిరసన



ఆందోళన నిర్వహిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

ఏలూరురూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లికి చెందిన ట్రాన్స్‌జెండర్ దీపు హత్యను నిరసిస్తూ ఏలూరులోని ట్రాన్స్‌జెండర్లు గురువారం ఆందోళన చేపట్టారు. ఆందోళనలో భాగంగా నగరంలో ర్యాలీ నిర్వహించి ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో నినాదాలు చేశారు. సమాజంలో చిన్న చూపుతో బతుకులు వెళ్లదీస్తున్నామన్నారు. నిందితుడి ఫ్లెక్సీలను కాళ్లతో తొక్కి నిరసన తెలిపారు. దీపును అతి కిరాతకంగా హత్య చేసిన నిందితుడిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగరంలోని పలువురు ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

గ్రామ కట్టుబాట్లు చట్ట పరిధిలోనే ఉండాలి

నిడమర్రు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు తీర ప్రాంత గ్రామాలలో పెద్దలు అనుసరిస్తున్న కట్టుబాట్లు చట్ట ప్రకారం మాత్రమే ఉండాలని ఎస్ఐ వీరప్రసాద్ సూచించారు. తోకలపల్లి సామాజిక భవనంలో గురువారం గ్రామ పెద్దలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ భార్యభర్తల గొడవల పేరుతో జరిగే రాజీ ప్రయత్నాలు, ఆర్థికనేరాలలో సామాజిక చర్యలు చట్టప్రకారం మాత్రమే జరగాలని, చట్టాన్ని అతిక్రమించడం నేరమవుతుందన్నారు. అనంతరం సైబర్ నేరగాళ్ల మోసాలు, మహిళ రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుబ్బారావు, గ్రామ పంచాయతీ కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దల కమిటీ సభ్యులు , యువకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

ఏలూరు అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల నివారణపై గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో ఈగిల్ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ గిరిబాబు తెలిపారు. ఎక్కడైనా మాదకద్రవ్యాల వినియోగం కనిపిస్తే టోల్‌ఫ్రీ నెంబరు 1972కి సమాచారం ఇవ్వాలని ఈగిల్ సెల్ జిల్లా ఇన్‌చార్జి ఉదయభాస్కర్ సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి మేత

పెదవేగి సామాజిక తనిఖీలో బయటపడ్డ అవినీతి



ఉపాధి పనులపై ఆరా తీస్తున్న అధికారులు

పెదవేగి, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతంలో పేదలకు ఉపాధి హామీ పథకం ఆసరాగా ఉంది. ఈ పథకాన్ని కొంతమంది అక్రమార్కులు అనుకూలంగా మార్చుకుని మేత మేసేస్తున్నారు. మండలంలో 2023- 24 ఆర్థిక సంవత్సరంలో రూ.23 కోట్ల ఉపాధిపనులు జరిగాయి. మండలంలోని 30 గ్రామాల్లో వారం రోజులుగా అధికారులు తనిఖీ నిర్వహించారు. పనికి ఎంతమంది వచ్చారు, మస్తరు నమోదుపై విచారణ జరిపారు. గ్రామాల్లో విచారణ అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మండల స్థాయి సామాజిక తనిఖీ సమావేశంలో గ్రామాల్లో నిర్వహించిన అంశాలను చదివి వినిపించారు. అత్యధిక గ్రామాల్లో ఉపాధి పనులు పక్కదారి పట్టినట్లు తేల్చారు. భోగాపురంలో 18పాత ఇళ్లను కొత్తగా కట్టినట్లు చూపించి, రూ.3లక్షలు చెల్లింపులు చేశారు. రూ.9లక్షలకు సంబంధించిన మస్తర్లపై వేతనదారులు కాకుండా మేట్ ఒక్కరే సంతకాలు చేశారు. ఇదే విషయాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ అంగీకరించడం గమనార్హం. లక్ష్మీపురంలో పనికి వెళ్లని వారు, గ్రామంలోని వారి పేర్లతో బినామీ మస్తర్లు వేసి సొమ్ము లాగేసుకున్నారు. చెరువులో పని చేయకుండా చేసినట్లు రికార్డు చేసి, రూ.10 లక్షలు కాజేశారు. తాళ్లగోకవరంలో చనిపోయిన 14మంది పనికి వచ్చినట్లు మస్తరు వేసి, సొమ్ము కూడా చెల్లించేశారు. చాలాగ్రామాల్లో నిధులు లక్షల్లో స్వాహా చేశారు. పక్కదారి పట్టిన నిధులను బాధ్యుల నుంచి తిరిగి రాబడతామని అధికారులు తెలిపారు. విజిలెన్స్ ఏపీడీ పురుషోత్తం, ఎస్ఆర్పీ సూర్య, ఎంపీడీవో పి.శ్రీనివాస్, ఏపీవో హేమలత, ఎస్ఆర్ఈజీఎస్ బృందం పాల్గొన్నారు.





నిడమర్రు మండలం ఎనికేపల్లి ఉపసర్పంచ్‌గా ఎన్నికైన సప్పా లక్ష్మితో వార్డు సభ్యులు, దెందులూరు ఉప సర్పంచ్ అప్పారావు, పెదవేగి మండలం కొండలరావుపాలెం, రామశింగవరం ఉప సర్పంచ్ రమేశ్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఈవోపీఆర్డీ

ఏలూరు రూరల్ వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా



ఏలూరు మండల పరిషత్‌లో సభ్యులకోసం వేచిచూస్తున్న అధికారులు

ఏలూరురూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఏలూరురూరల్ మండలం రెండో వైస్ ఎంపీపీ ఎంపిక ఎంపీటీసీ సభ్యుల కోరం లేక వాయిదా పడింది. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశానికి సభ్యులు హాజరుకాకపోవడంతో శుక్రవారానికి వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ఎన్నికల అధికారులు ఎదురుచూసినా కోరం లేకపోవడంతో ఎన్నికల అధికారి దేవి ఎన్నిక వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఎంపీపీ శ్రీనివాసరాజు ఉన్నారు. రెండో వైస్ ఎంపీపీ రాజీనామాతో ఎన్నిక అనివార్యమైంది. తొమ్మిది మంది సభ్యులు హాజరుకావాల్సి ఉండగా ఒక్క సభ్యుడు కూడా రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్టు ఆమె తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు నివేదిక పంపినట్టు ఎంపీడీవో శ్రీలత తెలిపారు. ఎన్నికలు నిర్వహించే సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద త్రీటౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

దెందులూరు ఉప సర్పంచ్‌గా అప్పారావు

దెందులూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): దెందులూరు ఉప సర్పంచ్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు, మూడో వార్డు సభ్యుడు బర్నాల అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పంచా యతీ కార్యాలయంలో సర్పంచ్ తోట ఏసమ్మ, ఎన్నికల అధికారి ఎస్.సూర్య కుమార్, కార్యదర్శి స్టాలిన్‌బాబు ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం నిర్వహించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన అప్పారావును గారపాటి కొండయ్య చౌదరి, యిప్పిలి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ శేషారత్నం, పెనుబోయిన మహేష్ యాదవ్, పలువురు నాయకులు అభినందించారు

పెదవేగి మండలంలో రెండు..

పెదవేగి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొండలరావుపాలెం, రామశింగవరం గ్రామాల్లో ఉప సర్పంచ్ పదవులకు గురువారం ఎన్నిక నిర్వహించారు. రామశింగవరం ఉప సర్పంచ్‌గా బండారు రమేష్, కొండలరావుపాలెం ఉప సర్పంచ్‌గా కాట్రు దివ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన ఉపసర్పంచ్‌లకు ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందించారు. రామశింగవరం ఎన్నికల అధికారిగా ఈవోపీఆర్డీ షరీఫ్, కొండలరావుపాలెం ఎన్నికల అధికారిగా భీమడోలు ఈవోపీఆర్డీ సుందరి వ్యవహరించారు.

ఎనికేపల్లి ఉప సర్పంచ్ ఏకగ్రీవం

నిడమర్రు మార్చి 27: మండలంలో ఎనికేపల్లి ఉప సర్పంచ్‌గా సప్పా లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 8 వార్డు సభ్యులు ఉండగా లక్ష్మికి మిగిలిన ఏడుగురు సభ్యులు మద్దతు తెలియజేశారు. దీనితో సప్పా లక్ష్మి ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల అధికారి, ఈవోపీఆర్డ్ టి.స్వామి ప్రకటించారు. ఈ ఎన్నికల పక్రియలో గ్రామ సర్పంచ్ పుప్పాల మెహర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన మోహనరావు, ఆదినారాయణ

'ఫ్యాప్టో' జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఏలూరు అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా కార్యవర్గ ఎన్నికలు గురువారం జరిగాయి. రొటేషన్ పద్ధతిలో రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాల నుంచి కార్యవర్గ పదవులకు నాయకులను రెండేళ్ల కాలపరిమితికి ఎన్నుకుంటారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా జి.మోహనరావు (ఏపీటీఎఫ్-1938), సెక్రటరీ జనరల్‌గా ఎం.ఆదినారాయణ (డీటీఎఫ్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోచైర్మన్లుగా జి.వెంకటేశ్వరరావు (బీటీఏ), జి.ప్రకాశ్‌రావు (హెచ్ఎంల సంఘం), డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా ఆర్.రవికుమార్ (యూటీఎఫ్), ఎం.శామ్యూల్ (ఎస్టీయూ), బి.రెడ్డిదొర (ఏపీటీఎఫ్-257), సెక్రటరీగా సీహెచ్.శివరామ్(ఏపీపీటీఏ), ట్రెజరర్‌గా ఎస్డీ.జిలాని(ఆర్‌యూటీఏ)ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఫ్యాప్టో రాష్ట్ర కోచైర్మన్ వి.మనోజ్‌కుమార్ వ్యవహరించారు.

పాస్టర్ మృతిపై విచారణ చేయాలి

టి.నరసాపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): క్రైస్తవ మత ప్రబోధకుడు ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని మండల ఫైర్ ప్రేయర్ టీమ్ అధ్యక్షుడు జి.జ్ఞాన్‌రాజు, కె.నిరీక్షణరావు, సీహెచ్ పోశయ్య డిమాండ్ చేశారు. మర్రిగూడెంలో గురువారం పాస్టర్లు శాంతియుత ర్యాలీ నిర్వహించి ప్రవీణ్ మృతికి సంతాపం తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆయన మృతి వెనుక అనుమానాలున్నాయన్నారు. ప్రభుత్వం సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని వారు కోరారు. క్రైస్తవ సేవకులు, సంఘాలపై జరుగుతున్న ఘటనలు అరికట్టాలన్నారు. వై.పాల్‌చిన్నారావు, ప్రసన్నకుమార్, జకరయ్య, చార్లేస్, జోయల్, జోసప్, తీతు, దానియేలు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



కౌలు రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

టి.నరసాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కౌలురైతు చెన్నారావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య డిమాండ్ చేశారు. టి.నరసాపురం ముత్యాలమ్మపేటలో అప్పుల భారంతో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న గుర్రం చెన్నారావు కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. చెన్నారావు కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించాలని, చెన్నారావు ఇద్దరు పిల్లలను గురుకుల పాఠశాలలో చేర్పించి ఉన్నత విద్య వరకు ప్రభుత్వమే చదివించాలని డిమాండ్ చేశారు. దొంతా కృష్ణ, పుల్లూరి సోమశేఖర్, కంచర్ల గురవయ్య, సాగర్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

చింతలపూడి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు బాధిత కుటుంబాలను ఆదుకోవాలని పి.జమలయ్య, కె.సోమశేఖర్, దొంత కృష్ణ డిమాండ్ చేశారు. యర్రగుంటపల్లి రైతు సేవా కేంద్రంలో గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. జె.రామచంద్రారెడ్డి, కుప్పాల సురేష్, ఉమ్మడి శ్రీను, రాజారావు పాల్గొన్నారు.

మునిసిపల్ ఎన్నికల నాటికి జనసేన బలోపేతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేకా ఈశ్వరయ్య

చింతలపూడి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఎన్నికల నాటికి జనసేన పార్టీ మరింత బలోపేతం కావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య అన్నారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. అనంతరం ఈశ్వరయ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం సభ్యుల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నామని చెప్పారు. 20 వార్డులకు ఇద్దరు చొప్పున ఇన్‌చార్జ్‌లుగా బాధ్యత ఇస్తున్నామని, ఆయా వార్డులలో ప్రజల సమస్యలు తెలుసుకోవడం, పరిష్కారానికి కృషి చేయాలని సూచించామన్నారు. చింతలపూడిలో జనసేన పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో మండల శాఖ అధ్యక్షుడు చీదరాల మధుబాబు, యేసుబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించాలి

టి.నరసాపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించి అధిక దిగుబడి సాధించాలని చింతలపూడి ఏడీఏ పి.నాగకుమార్ తెలిపారు. టి.నరసాపురంలో పొలంబడి కార్యక్రమంలో గురువారం వరి చేలను పరిశీలించారు. రబీలో వచ్చే తెగుళ్లపై అవగాహన పెంచుకుని ప్రకృతి వ్యవసాయంలో లభించే కషాయం పిచికారి చేయాలన్నారు. రైతులు పురుగుమందులు, రసాయనిక ఎరువులు వినియోగం తగ్గించాలన్నారు. ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మిగిలిన రైతులు తమ ఏరియాలోని రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి సుమలత, నరేంద్ర, అనూష, రైతులు శామ్యూల్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరురూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వం, ఆయుష్ మంత్రిత్వ శాఖ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగా అభివృద్ధికి కృషి చేసిన అవార్డులు ఇవ్వనున్నారు. 2025 సంవత్సరానికి ప్రధాన మంత్రి యోగా అవార్డుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. నిష్కళంకమైన ట్రాక్ రికార్డు, యోగా ప్రమోషన్, అభివృద్ధికి సహకరించిన వ్యక్తులు, సంస్థలకు అవార్డులు ఇవ్వబడతాయన్నారు. అర్హులు, సంస్థలు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఈనెల 31లోపు దరఖాస్తులు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఏలూరు నుంచి వాడపల్లికి బస్సు

ఏలూరు క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నుంచి వాడపల్లి క్షేత్రానికి ప్రతి శనివారం ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి ఎన్‌వీఆర్.వర ప్రసాద్ తెలిపారు. ఏలూరు నుంచి కైకలూరు, ఆకివీడు, కాపవరం, గణపవరం, పిప్పర, తాడేపల్లిగూడెం మీదుగా వాడపల్లి చేరుకుంటుంది. తిరిగి 11.30 గంటలకు వాడపల్లి నుంచి అదే మార్గంలో కైకలూరు మీదుగా ఏలూరు చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

చింతలపూడి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మాణిక్యాలరావు

చింతలపూడి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): చింతలపూడి బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు గురువారం జరిగాయి. అధ్యక్షుడిగా కాకర్ల మాణిక్యాలరావు, ఉపాధ్యక్షుడిగా వి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పింగుల డేవిడ్‌రాజు, ఎన్నికయ్యారు. కార్యదర్శిగా టీఎన్ ఫణిదీప్, కోశాధికారిగా నాగార్జున, లైబ్రరీ కార్యదర్శిగా టి.వెంకటేష్, గౌరవ అధ్యక్షుడిగా వి సుందరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇంటర్వ్యూ..

వేసవిలో వడదెబ్బ, డీహైడ్రేషన్ ప్రధాన సమస్యలు

డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, ద్వారకాతిరుమల



- **వేసవిలో ప్రధాన ఇబ్బందులు?**

డాక్టర్ : వేసవిలో అధిక ఉష్ణోగ్రత, వేడిగాలుల వల్ల వడదెబ్బ, డీ హైడ్రేషన్ సమస్యలు వస్తాయి. సరైన సమయంలో చికిత్స అందకుంటే ప్రాణాంతకమే.

- **వడదెబ్బ లక్షణాలు ఏమిటి?**

డాక్టర్ : చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు, మగత నిద్ర లేదా కలవరింతలు, ఫిట్స్ లేదా పాక్షిక అపస్మారక స్థితి.

- **వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు..?**

డాక్టర్ : ఎండలో తిరగకూడదు, వేడి గాలికి గురికాకూడదు. చిన్నారులు, వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలి. మంచినీరు, పళ్ల రసాలు, కొబ్బరినీరు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఎండలో తిరగవద్దు. అవసరమైతే గొడుగు, టోపీ వంటివి ధరించి బయటకు వెళ్లాలి. ఇంట్లో కిటికీలు తెరచి ఉంచాలి.

- **వడదెబ్బ తగిలితే చేయాల్సిన ప్రథమ చికిత్స..?**

డాక్టర్ : వడదెబ్బకు గురైన వ్యక్తిని ముందుగా నీడలోకి చేర్చాలి.. తడిగుడ్డతో శరీరం తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకూ ఇలా చేయాలి. చల్లని గాలి తగిలేలా చూడాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఓఆర్ఎస్ తాగించాలి. అపస్మారక స్థితిలో ఉంటే నీరు తాగించరాదు. వీలైనంత త్వరగా దగ్గరలోని పీహెచ్‌సీకి తరలించాలి.

ద్వారకాతిరుమల, ఆంధ్రజ్యోతి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టర్ చక్రవర్తి

ఏలూరులో అగర్వాల్స్ కంటి ఆసుపత్రి ప్రారంభం

ఏలూరు అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కంటి సంబంధిత వైద్య సేవల్లో డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ దక్షిణ భారతదేశంలో అగ్రస్థానంలో ఉందని అగర్వాల్స్ కంటి ఆస్పత్రుల గ్రూప్ మెడికల్ డైరెక్టర్ కేఎస్ ఎస్.చక్రవర్తి అన్నారు. ఏలూరులో అగర్వాల్స్ కంటి ఆసుపత్రిని గురువారం ఆయన ప్రారంభించారు. కంటిసంబంధిత సమస్యలు, వ్యాధులకు చికిత్సలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచామన్నారు. ఏలూరులో ఏర్పాటుచేసిన కంటి ఆసుపత్రి ఏపీలో 20వ బ్రాంచి, దేశంలో 231వ శాఖగా ప్రారంభించామని వివరించారు. ఏడాది పొడవునా రేయింబవళ్లు వైద్య సేవలు లభిస్తాయన్నారు. ఆసుపత్రి రాజమండ్రి డైరెక్టర్ డాక్టర్ విజయ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి దరఖాస్తుల పరిశీలన

ద్వారకాతిరుమల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్, ఎస్సి కార్పొరేషన్‌ల ద్వారా లబ్దిదారులకు స్వయం ఉపాధి రుణాల మంజూరుకు గురువారం దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం జరిగింది. మండలానికి 57 యూనిట్లు మంజూరు కాగా 834 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో పీవీవీ.ప్రకాష్ తెలిపారు. అర్హులను గుర్తించి బ్యాంకుల ద్వారా సబ్సిడీతో యూనిట్లను బట్టి రుణాలు మంజూరు చేస్తామన్నారు. దరఖాస్తుదారులతో ఎంపీడీవో కార్యాలయం ప్రాంతం కిక్కిరిసింది.

- జంగారెడ్డిగూడెం: స్వయం ఉపాధి పథకాల దరఖాస్తుదారులకు ఈ నెల 29, ఏప్రిల్ 2, 3 తేదీల్లో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ గురువారం తెలిపారు.
- లింగపాలెం: మండలంలో స్వయం ఉపాధి సోపానం దరఖాస్తుదారులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో కె.వాణి తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

జంగారెడ్డిగూడెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.కామ్ ఫైనల్ ఇయర్ ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న ఇద్దరు విద్యార్థులు ఓటీపీ టెక్నాలజీస్‌లో రూ.1.2 లక్షల వార్షిక జీతంలో ఉద్యోగం పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్‌బాబు తెలిపారు. విద్యార్థులు సంకు సంపత్, కాకులపాటి ఆంటోనిని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు మట్టా మధు, అశోక్, సీహెచ్.రమాదేవి, కేవీవీ.శిరీష, జె.రాజా శ్రీకాంత్ తదితరులు అభినందించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

లింగపాలెం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన యువతి కనిపించడం లేదని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈనెల 24న ఆమె తల్లి పనికివెళ్లి ఇంటికి రాగా కుమార్తె కనిపించకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికింది. యువతి ఆచూకీ లేకపోవ డంతో గురువారం ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ రాంబాబు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముదినేపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అన్నవరం 11 కెవి ఫీడర్ పరిధిలో వడాలి ఇన్‌లైన్ ఏబి ఏరియాలో చెట్లు నరికే పనులు నిర్వహిస్తున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ముదినేపల్లి సెక్షన్ ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. ఆక్వా రైతులు, గృహాల వినియోగదారులు గమనించాలని తెలిపారు.

సబ్సిడీ రుణాల పంపిణీకి ఇంటర్వ్యూలు


ముదినేపల్లిలో లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో, బ్యాంక్ మేనేజర్లు

ముదినేపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఓబీసీ, కాపు కులాలకు ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ రుణాల పంపిణీకి లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియ ముదినేపల్లి మండలంలో ప్రారంభమైంది. గురువారం మండల పరిషత్తు కార్యాలయంలో దుకాణాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలను ఎంపీడీవో వై.రామకృష్ణ నిర్వహించారు. మండలంలోని 32 గ్రామాలకు చెందిన 1074 మంది సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేశారు. గురువారం 16 గ్రామాలకు చెందిన 563 మంది దరఖాస్తు చేయగా 532 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మిగిలిన 16 గ్రామాలకు చెందిన 511 మంది దరఖాస్తుదారులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. బ్యాంకు మేనేజర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి చెరువులు నింపేందుకు కాల్వలకు నీరు

ముదినేపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల మంచినీటి చెరువులను నింపేందుకు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, సాగునీటి సంఘాల ఛైర్మన్లు సభ్యులు సహకరించాలని పాల్‌రాజ్ కెనాల్ ముదినేపల్లి సెక్షన్ ఏఈ కిశోర్ కోరారు. గురువారం ముదినేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలోని నీటి సంఘాల ఛైర్మన్లు, సభ్యుల సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ తొలివారానికి తాగునీటి అవసరాల కోసం నీరు విడుదల చేస్తున్నారని, జలవనరుల శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు. డీసీ పరిధిలోని డ్రెయిన్ల ఆక్రమణలు, గట్లపై అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. డీసీ ఛైర్మన్ నాగేశ్వరరావు, వైస్ ఛైర్మన్ హనుమార పేర్నీడు, విన్నకోట నీటి సంఘం అధ్యక్షుడు సీతారామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

వడాలి జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ


వడాలి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో నరేష్

ముదినేపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఎంఈవో కె.నరేష్ కుమార్ తనిఖీ చేశారు. వంటల రుచిని పరిశీలించారు. భోజనం, కూరలు, ఇతర పదార్థాలు ఎలా ఉంటున్నాయన్న విషయాన్ని ఆయన విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజన పథకం అమలులో ఎటువంటి పొరపాట్లు జరిగినా ప్రధానోపాధ్యాయుడు, ఏజెన్సీలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పాఠశాలల్లో మూడు సార్లు వాటర్ బెల్ కొట్టే విషయంలో అశ్రద్ధ చూపవద్దని తెలిపారు.


ముదినేపల్లిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న పాస్టర్లు

పాస్టర్ ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలి

ముదినేపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రాజమండ్రి సమీపంలో పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతి చెందిన సంఘటనపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గురువారం ముదినేపల్లిలో మండల పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్, ఎస్‌ఐ వీరభద్రరావుకు వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు ఉచ్చుల విజయ కుమార్, పుట్టా పేతురు, అర్జా యోహాన్, సాల్మన్‌రాజు, నిమ్మగడ్డ బిక్షాలు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బాబూరావు, మాదిగ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసుపోగు దానియేలు తదితరులు పాల్గొన్నారు.


చాట్రాయిలో కల్లాల్లో ఆరుబోసిన మొక్కజొన్న కండెలు

చాట్రాయి మండలంలో మొక్కజొన్న విప్లవం

- రబీలో ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి
- రైతులకు, కౌలు రైతులకు దండిగా లాభాలు

చాట్రాయి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలంలో మొక్కజొన్న విప్లవం కొనసాగుతున్నది. మండలంలో ఖరీఫ్ వరిసాగు భూములు 11,200 ఎకరాలు ఉండగా, 8,200 ఎకరాల్లో రబీ మొక్కజొన్న సాగు జరగడం విశేషం. అది కూడా మొక్కజొన్న పండని బాడవ భూముల్లో దాళ్వా వరి సాగు చేస్తున్నారు. గత కొన్నేళ్ల నుంచి రైతులు, కౌలు రైతులు రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగుచేస్తూ మంచి దిగుబడులు, లాభాలు పొందుతున్నారు. మొక్కజొన్న సాగు చేపట్టిన తరువాత అన్నదాత ఆర్థిక పరిస్థితి చాలా మెరుగైందని చెప్పవచ్చు. ఫౌల్ట్రీలు పెరిగిపోవడంతో మొక్కజొన్నకు మంచి డిమాండ్ ఉంది. పంట రైతు చేతికి రాగానే వ్యాపారులు వచ్చి మంచి ధరకు కొనుగోళ్లు జరుపుతున్నారు. ఒకప్పుడు మండలంలో రైతులు వర్షాధారంపై ఖరీఫ్ పంట సాగు చేసేవారు. తరచూ అనావృష్టి పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోయి రైతులు ప్రజలు కరువుతో విలవిలలాడేవారు. 1998లో అప్పటి సీఎం చంద్రబాబు తెచ్చిన అక్రమ వ్యవసాయ కనెక్షన్‌ల క్రమబద్ధీకరణ పథకం, 2004లో అప్పటి సీఎం వైఎస్ఆర్ అమలు చేసిన ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం వల్ల వరిసాగు భూముల్లో రైతులు బోరుబావులు తవ్వించుకొని విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. రబీ వ్యవసాయానికి అవకాశం ఏర్పడింది. ఖరీఫ్ వరిసాగులో పెద్దగా లాభాలు లేకపోయినా రబీ మొక్కజొన్న సాగులో సొంత భూముల రైతులకు ఎకరానికి రూ.30 వేలు, కౌలు రైతులకు రూ.15 వేలు లాభాలు వస్తున్నట్లు చెపుతున్నారు. ఈ ఏడాది కాలం అనుకూలంగా ఉండటంతో మొక్కజొన్న ఎకరానికి 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు, కౌలు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం క్వింటాల్ మొక్కజొన్న రూ.2200కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

మొక్కజొన్న సాగుతో లాభాలు



రబీలో మొక్కజొన్న సాగుచేసిన రైతులు కౌలు రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. ధరలు బాగానే ఉంటున్నాయి. మంచి యాజమాన్య పద్ధతులు పాటించిన రైతులకు ఎకరానికి 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్కజొన్న సాగు చేపట్టిన తరువాత రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగైంది.

\- చిమటబోయన పుల్లారావు
రైతు, కృష్ణారావుపాలెం

ఎన్డీఏ పాలనలో లౌకిక వ్యవస్థకు విఘాతం


చాట్రాయిలో మాట్లాడుతున్న నాయకులు

చాట్రాయి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సారధ్యంలో ఎన్డీఏ పాలనలో లౌకిక వ్యవస్థకు విఘాతం కలుగుతుందని సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, రాష్ట్ర నాయకులు చలసాని రామారావు విమర్శించారు. మండలంలో గురువారం సీపీఐ ప్రచార జాతా నిర్వహించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ ప్రధాన పాత్ర పోషించిందని, భూమి కోసం భుక్తి కోసం నినాదంతో అలుపెరగని ఉద్యమాలు చేసిన చరిత్ర ఉందన్నారు. సోమవరం, పోలవరం, చాట్రాయి, చిన్నంపేట తదితర గ్రామాల్లో ప్రచార జాతా సాగింది. కార్యక్రమంలో నిమ్మగడ్డ నరసింహా, రాయంకుల లక్ష్మణరావు, ఈవీ శ్రీనివాసరావు, కొమ్ము ఆనందం, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ ఉప ఎన్నిక నేటికి వాయిదా

- సమావేశానికి హాజరు కాని వైసీపీ ఎంపీటీసీలు
- ఆలస్యంగా సమావేశానికి టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు


కైకలూరులో సమావేశానికి హాజరైన కూటమి ఎంపీటీసీ సభ్యులు.. వైస్ ఉప ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటిస్తున్న ఆర్డీవో అచ్యుత్ అంబరీష్

కైకలూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కైకలూరు వైస్ ఎంపీపీ ఉప ఎన్నిక అనూహ్య పరిణామాల మధ్య శుక్రవారం నాటికి వాయిదా వేశారు. గురువారం కైకలూరు మండల వైస్ ఎంపీపీ ఎన్నికకు ఏలూరు ఆర్డీవో, ఎన్నికల అధికారి అచ్యుత్ అంబరీష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు. ఇరు పార్టీలకు సమానంగా సభ్యులు ఉండడంతో పదవి ఎవరిని వరిస్తుందో అనే దానిపై తీవ్ర నెలకొంది. 11 గంటలకు కూటమి ఎంపీటీసీ సభ్యులు 9 మంది హాజరయ్యారు. వైసీపీకి చెందిన ఒక్కరూ రాలేదు. అయితే కూటమికి చెందిన 10 మంది ఎంపీటీసీల్లో మండలంలోని తామరకొల్లు టీడీపీ ఎంపీటీసీ గంగుల వెంకటనరసమ్మ ఉప ఎన్నికకు ఆలస్యంగా వచ్చారు. అప్పటికే ఉన్న సభ్యులతో కోరం కాకపోవడంతో ఎన్నికల అధికారి శుక్రవారం నాటికి వాయిదా వేశారు. టౌన్, రూరల్ సీఐలు పి.కృష్ణ, వి.రవికుమార్ ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేశారు.

ప్రశాంతంగా ఉపసర్పంచ్ ఎన్నికలు

కలిదిండి/ముదినేపల్లి/మండవల్లి: భాస్కరావుపేట పంచాయతీ ఉప సర్పంచ్‌గా సాలి మేరమ్మ కుమారి గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కైకలూరు ఈవోపీఆర్డీ కొండలరావు వ్యవహ రించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఎత్తిపోతల కమిటీ చైర్మన్ వేగిరెడ్డి చిన్నారావు, నీటి సంఘం అధ్యక్షుడు మంతెన సుబ్బరాజు, నాయకులు సతీష్ రాజు, పిళ్లారి శెట్టి వేణు, పోకల ప్రసాద్, వసంతరావులు సర్పంచ్ గద్దె ఆనంద్ కుమార్‌లు మేరమ్మకి అభినందనలు తెలిపారు.

- ముదినేపల్లి మండలం ప్రొద్దువాక పంచాయతీ ఉపసర్పంచ్ పదవికి గురువారం జరిగిన ఎన్నికల్లో ఏడో వార్డు సభ్యుడు దొడ్డాకుల వీరాం జనేయులు విజయం సాధించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఈవోపీఆర్‌డీ బి.అశోక్ నిర్వ హించిన ఈ ఎన్నికల్లో ఉపసర్పంచ్ పదవికి వీరాంజనేయులు, జి.నారాయణ పోటీ పడగా వీరాంజనేయులు గెలుపొందారు. వీరాంజనేయులును సర్పంచ్ సింగనపల్లి రామ కృష్ణ, వార్డుసభ్యులు, పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్ అభినందించారు.
- మండవల్లి మండలం లోకుముడి, మూడు తాళ్లపాడు ఉప సర్పంచ్‌ల ఎన్నిక గురువారం ప్రశాంతంగా జరిగింది. ఆయా గ్రామాల్లో గతంలో ఉప సర్పంచ్‌లుగా పని చేసిన సూర్యతేజ, భాగ్యం వ్యక్తిగత కారణాలతో పదవులకు రాజీనామా చేశారు. లోకుముడి ఉప సర్పంచ్‌గా వెంట్రుపాటి నిర్మల, మూడు తాళ్లపాడు ఉపసర్పంచ్‌గా జీవనమ్మలను వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


భాస్కరావుపేట ఉపసర్పంచ్ మేరమ్మ కుమారిని సత్కరిస్తున్న కూటమి నాయకులు


ప్రొద్దువాక పంచాయతీ ఉప సర్పంచ్‌గా ఎన్నికైన వీరాంజనేయులకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఈవోపీఆర్డీ అశోక్


లోకుముడి ఉపసర్పంచ్‌గా ఎన్నికైన నిర్మలను సత్కరిస్తున్న కూటమి నాయకులు

కట్నం వేధింపులపై కేసు నమోదు

ముదినేపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం అత్త, మామలు, భర్త వేదిస్తు న్నారంటూ.బాధితురాలు పోలీసుకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ముదినేపల్లికి చెందిన ఓ యువతికి, విజయవాడ మధురానగర్‌కు చెందిన అబ్దుల్ రెహమాన్‌కు 2022లో వివాహం జరిగింది. ఆ సమయంలో పుట్టింటి వారు రూ. 5లక్షల కట్నం, బంగారం కూడా ముట్టచెప్పారు. ఇటీవల అదనపు కట్నం కోసం వేధింపులు ప్రారంభమయ్యాయి. వివాహిత తరపున బంధువులు, కొంతమంది పెద్దలు సయోధ్య కుదిర్చేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఇటీవల ఆమె ముదినేపల్లిలోని పుట్టింటికి వచ్చేసింది.దీనిపై ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియలకు వైష్ణవి సాయం

ముదినేపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం కొరగుంటపాలెంలో కూలి పనులపై ఆధార పడి జీవిస్తూ ఊపిరితిత్తుల వ్యాధితో గురువారం మరణించిన గుడిసేటి రామోజీ అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ.5 వేల సహాయం అందజేశారు. వైష్ణవి తరపున ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ ఈ సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.



కలిదిండి న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి శివకుమార్

పోక్సో యాక్ట్‌పై విద్యార్థులకు అవగాహన అవసరం

కలిదిండి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పోక్సో యాక్ట్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కైకలూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకిరణ్ అన్నారు. గురువారం కలిదిండి ప్రైవేట్ హైస్కూలు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో యాక్ట్ కింద జైలు శిక్ష పడుతుందన్నారు. ప్యానెల్ లాయర్స్ పవన్ కాంత్, ప్రసన్న కుమార్, రాంబాబు, ప్రధానోపాధ్యాయురాలు కరుణకుమారి, లీగల్ సర్వీసెస్ కమిటీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ పరికరాల పంపిణీ

ముదినేపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలానికి ప్రభుత్వం మంజూరు చేసిన కల్టివేటర్లు, తైవాన్ పంపు సెట్లు, రోటా వేటర్లను రైతులకు సబ్సిడీపై పంపిణీ చేశారు. 42 మందికి తొలి విడతగా ఈ పరికరాలను అందజేశారు. ట్రాక్టర్లు కలిగిన రైతులకు రైతు సేవా కేంద్రాల ద్వారా 50 శాతం సబ్సిడీపై కల్టివేటర్లను అందజేశామని, రెండవ విడతలో మంజూరయ్యే యూనిట్లను అర్హులైన రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

నేడు సీసీ రోడ్లు ప్రారంభం

కలిదిండి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళ్లపాలెం, కొండూరు, తాడినాడ, చినతాడినాడ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించనున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

గృహాల లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ

చాట్రాయి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్తి గృహాల లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రకటించిన అదనపు సాయం వారి బ్యాంకు ఖాతాలకు జమ అవుతోంది. వైసీపీ సర్కార్ హయాంలో ఆర్థిక ఇబ్బందులతో నిలిచిపోయిన ఎస్సీ, బీసీల ఇళ్లకు రూ.50 వేలు చొప్పున, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున ప్రభుత్వం అదనపు సాయం ప్రకటించింది. మండలంలో ఎస్సీలు 440, ఎస్టీలు 36, బీసీలు 133 మొత్తం 609 ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. 226 మందికి రెండు రోజుల నుంచి రూ 33.65 లక్షలు జమ కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేసవిలో ప్రణాళిక బద్ధంగా నీటి సరఫరా

నూజివీడు టౌన్, మార్చి 27 : వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామాల సెక్రటరీలు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో చెన్ను రాఘవేంద్రనాథ్ అన్నారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధ్యక్షతన గురువారం జరిగిన మండల పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండలు పెరుగుతున్న తరుణంలో తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ప్రతీ ఒక్కరి నినాదంగా ముందడుగు వేయాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలకు బస్ నడపండి

నూజివీడు టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు డిపో నుంచి మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలకు ఆర్టీసీ బస్సు సర్వీసును నడపాలని ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్ కుమార్‌ను బీజేపీ నేత నాగరాణి వినతిపత్రం అందజేశారు. ఎయిమ్స్ ఆసుపత్రి సేవలు నూజివీడు పరిసర ప్రాంత ప్రజలకు బస్సు సర్వీస్ ఉప యోగపడుతుందన్నారు. అధికారులు తక్షణమే స్పందించి బస్సు సర్వీసులను ప్రారంభించాలని నాగరాణి విజ్ఞప్తి చేశారు. శ్రీరామనవమి సందర్భంగా ప్రసిద్ధ పుణ్య క్షేత్రం భద్రాచలంకు ప్రత్యేక సర్వీసులు నడపాలని కోరారు. దేసపాటి మల్లికార్జున జగదీష్, దద్దనాల రవికిషోర్, సూర్యప్రకాష్‌కుమార్, సిహెచ్ సంజయ్, పద్మిని పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475


నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ నూజివీడు శాఖ కార్యవర్గం

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కరుణాకర్

నూజివీడు టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్ నూజివీడు శాఖ కార్యవర్గ ఎన్నిక గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కేపీ.కరుణాకర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా చీపు అర్జున్‌రావు, ఉపాధ్యక్షుడిగా దార్లకుమారి, జాయింట్ సెక్రటరీగా పి.రవికిశోర్, ట్రెజరర్‌గా బూరుగు దేవదానం, బసవరావు ఎన్నికయ్యారు. అధ్యక్షుడు కరుణాకర్ మాట్లాడుతూ న్యాయవాదులకు నివేశన స్థలాల సాధన, నూజివీడు కోర్ట్ ప్రాంగణంలో వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట సత్యనారాయణ, బసవరాజు రామకృష్ణ, గోవాడ నీలాంబరం, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి


బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ముసునూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బలివే ఉత్సవాల్లో నీటమునిగి మృతిచెందిన వారి కుటుంబాలతోపాటు అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్న కౌలురైతుల కుటుంబాలను ప్రభుత్వం అదుకోవాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. సీపీఐ ప్రచార జాత గురువారం అక్కిరెడ్డిగూడెం, వలసపల్లి, చెక్కపల్లి తదితర గ్రామాల్లో జరిగింది. కృష్ణచైతన్య మాట్లాడుతూ బలివే ఉత్సవాల్లో మృతి చెందిన ఎచ్చు రాంబాబు, అప్పులభారంతో ఆత్మహత్య చేసుకున్న గోగులంపాడుకు కౌలురైతు చెన్ను రాజారావు కుటుంబాలకు నేటికీ సాయం చేయకపోవడం దారుణమన్నారు. చలసాని వెంకట రామారావు, నిమ్మగడ్డ నరసింహా, వసంతరావు, ముఖర్జీ, నాగం అచ్యుత్, చాట్లా పుల్లారావు, కె.ఆనంద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


రాజ్‌కుమార్‌ను అభినందిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు

రాజ్‌కుమార్‌కు అభినందన

నూజివీడు టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ బాధ్యతలతో పాటు క్రీడల్లో రాణిస్తున్న సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ రాజ్‌కుమార్‌ను మునిసిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి అభినందించారు. పాత పేట 2 సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేస్తున్న రాజ్‌కుమార్ ఢిల్లీలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ కోకో టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆయన జట్టు మూడో స్థానంలో నిలవడంలో కీలక పాత్ర పోషించారు. రాజ్‌కుమార్‌ను పలువురు అధికారులు అభినందించారు.


అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న కమిషనర్, టీడీపీ నాయకులు

అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కమిషనర్

నూజివీడు టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు అన్న క్యాంటీన్ మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షులు మల్లిశెట్టి జగదీష్, తదితరులు పరిశీలించారు. భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తి ప్రయత్నం చేశారు.

శ్మశానవాటికలో నీటి బోరుకు నిధులు మంజూరు

ముసునూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ముసునూరు హిందూ శ్మశానవాటికలో నీటి బోరు ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్, స్థానికులు గురువారం శ్మశానవాటిక పరిశీలించి బోరు పాయింట్‌ను నిర్ధారించారు. ఏఈ మాట్లాడుతూ రూ.2 లక్షలతో బోరు పనులను రెండు రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. తులిమెల్లి రంగరావు, చెన్ను సత్యనారయణ, మానికల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఎక్సైజ్ నిందితులు అరెస్ట్

చాట్రాయి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ కేసులలో నిందితులు ధరావతు శ్రీరాములు, హసవతు విజయ, చలకంటి సతీశ్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ మస్తానయ్య తెలిపారు. తిరువూరు కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి రిమాండ్ విధించారన్నారు.

నేడు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

చాట్రాయి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ, కాపు, ఈడబ్ల్యుఎస్ కార్పొరేషన్ల రుణాల దరఖాస్తుదారులకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు పాస్‌బుక్ ఫొటోస్టాట్ కాపీలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన ప్రతి తీసుకొని రావాలన్నారు.